TGTEL/25/A1132

ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..



'జనంవార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889

మేడ్చల్ | శుక్రవారం | 19.09.2025 | సంపుటి : 1 | సంచిక : 87 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్



03

## అల్మట్టి ఎత్తు పెంచుతున్నా పట్టించుకోరా?

- కృష్ణా జలాల వాటా వదులుకోమన్న సీఎం చేస్తున్నదేంటి?
- సీఎం రేవంత్ తీరుపై మండిపడ్డ మాజీ ఎంపీ వినోద్ కుమార్



## హైదరాబాద్‌లో మళ్లీ వర్షం

**లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వరదనీరు**

**వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు**

నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, ఫిల్మ్‌నగర్, ఎర్రగడ్డ, యూసఫ్‌గూడ, అమీర్‌పేట, బోర బండ, చార్మినార్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మిగతా 4లో

### మూడురోజులు భారీ వర్షాలు

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

04

## బతుకమ్మ, దసరాకు టీజీఎస్ఆర్టీసీ 7754 ప్రత్యేక బస్సులు

**ఈ నెల 20 నుంచి అక్టోబరు 2 వరకు నడపాలని నిర్ణయం**

బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీజీఎస్ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ఈ నెల 20 నుంచి అక్టోబరు 2 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 7754 ప్రత్యేక సర్వీసులను నడపాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అందులో 377 స్పెషల్ సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. పండక్కి సొంతూళ్లు వెళ్లినవారు తిరుగుపయనమయ్యేందుకు వీలుగా అక్టోబర్ 5, 6 తేదీల్లోనూ రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపేందుకు సిద్ధమవుతోంది.




04



## సీఎం రేవంత్‌తో బ్రిటిష్ హైకమిషనర్ లిండీ భేటీ

**తెలంగాణ విద్యార్థులకు సహకారం ఇస్తామని హామీ**

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :** భారత బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం జూబ్లీహిల్స్ నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యూకే ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా అందించే చెవెనింగ్ స్కాలర్ షిప్ కోఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు లిండీ కామెరాన్ అంగీకరించారు. ఎడ్యుకేషన్, టెక్నాలజీ సంబంధి త రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రికి బ్రిటిష్ హైకమిషనర్ వివరించారు.

మిగతా 3 లో

## జూబ్లీహిల్స్‌లో బచ్చాగాడిని పెట్టి గెలిపిస్తా

- అసెంబ్లీ ఎన్నికలు కాదు.. జూబ్లీహిల్స్ గురించి మాట్లాడు
- పార్లమెంటులో ఎంత వచ్చిందో, లోకల్ బాడీలో కూడా అంతే
- కెటిఆర్‌కు మంత్రి పొంగులేటి సవాల్


**ఖమ్మం, సెప్టెంబర్ 18 :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన ఇష్టం వచ్చినట్లు కాంగ్రెస్ పార్టీపై మాట్లాడుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. మూడున్నరేళ్ల తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికల గురించి కాకుండా, తక్షణంలో జరిగే జూబ్లీహిల్స్ ఉపఎన్నికల గురించి కేటీఆర్ ఆలోచించాలని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నిక లో బచ్చా గాడిని పెట్టి గెలిపిస్తానంటూ కేటీఆర్‌కు పొంగులేటి సవాల్ విసిరారు.

మిగతా 2 లో



హైదరాబాద్,సెప్టెంబర్18: బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి అని, ప్రకృతిని గౌరవించడం, ప్రకృతిని కాపాడటం మనందరి బాధ్యత అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ పండుగలో పెద్దఎత్తున పాల్గొని ప్రపంచానికి చాటి చెప్పాలని తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు బతుకమ్మ పండుగ సంబరాలు జరుగుతాయని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. ఈ నెల 21వ తేదీన వరంగల్ జిల్లాలోని వెయ్యి స్తంభాల ఆలయం వద్ద బతుకమ్మ సంబరాలు ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు. గిన్నిస్ బుక్ రికార్డులో చేరే విధంగా సంబరాలు నిర్వహిస్తామని తెలిపారు.

- మిగతా 2వ పేజీలో



## తెలంగాణ సంస్కృతికి ప్రతీక | బతుకమ్మ

**21న వేయి స్థంభాల గుడిలో తొలి బతుకమ్మ**

**గిన్నిస్ బుక్‌లో చోటు దక్కేలా సంబరాలు**

**మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి**

# ఓట్ల తొలగింపునకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్

## ఇతర రాష్ట్రాల ఫోన్లు ఉపయోగింపు

*కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న ప్రాంతాల నుంచి ఓట్లను తొలగించారని విమర్శించారు. రాష్ట్రం వెలుపలి నుంచి నకిలీ లాగిన్లు, ఫోన్ నంబర్లను ఉపయోగించి ఓటర్ ఐడీలను తొలగించినట్లు వ్యాఖ్యానించారు.*

**ఒక రాష్ట్రం తరవాత మరో రాష్ట్రం**

**కాంగ్రెస్‌కు పడే ఓట్ల జాబితా గుర్తించి చర్య**

**పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాహుల్ వివరణ**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 :** ఢిల్లీలో మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. ఆరోపణలు చేశారు. ఓట్ల తొలగింపు అంతా వ్యక్తులతో గాకుండా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి చేస్తున్నారు. అదంతా ఒక పక్రియ ప్రకారం జరుగుతోంది. ప్రతిపక్షాలకు ఓట్లు- వేసే కమ్యూనిటీలను మరీ ముఖ్యంగా లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనికి సంబంధించి మేం 100 శాతం ఆధారాలను గుర్తించామన్నారు. త్వరలో ఎన్నికల సంఘంపై హైడ్రోజన్ బాంబ్ పేల్చబోతున్నట్లుగా ప్రకటించినట్టుగానే గురువారం రాహుల్‌గాంధీ పేల్చారు.

06







## సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు అసాధ్యం

**రాహుల్ ఆరోపణలపై ఈసీ వివరణ**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 :** ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, అవాస్తవమని స్పష్టం చేసింది. ప్రజలను తప్పుదోవ పట్టించేలా రాహుల్ మాట్లాడుతున్నారని ఈసీ వ్యాఖ్యానించింది. ఈ మేరకు ఎన్నికల సంఘం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆన్‌లైన్ విధానంలో ఓట్లను నేరుగా తొలగించడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది.

- మిగతా 6వ పేజీలో

## రాహుల్ అబద్ధాల ప్రచారం

**విమర్శలపై మండిపడ్డ బిజెపి నేతలు**




ఓట్ల తొలగింపు అంటూ రాహుల్ తప్పడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని భాజపా దుయ్యబట్టింది. రాహుల్‌కు రాజ్యాంగం, చట్టం అర్థం కావడం లేదు. 2014 నుంచి మోదీజీ సాధిస్తున్న విజయాలన్నీ నిజం కాదని ఆయన ఆరోపిస్తున్నారు. ఈ వ్యాఖ్యలు దేశ ప్రజలకు, ఓటర్లకు అవమానం. ఆయన బాంబు గురించి మాట్లాడుతున్నారు. ఈ ప్రకటనలను తీవ్రంగా ఖండిస్తున్నాను అని మాజీ కేంద్రమంత్రి రవిశంకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హైడ్రోజన్ బాంబు పేలుస్తామని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు. ఆ బాంబ్ ఇలాగే ఉంటుందా.. వాళ్లు ఓటమిని చవిచూస్తున్నారు. ఈ సమయంలో వారు చేయా ల్సింది దానిని అంగీకరించడం.

- మిగతా 6వ పేజీలో



# హైదరాబాద్ బ్రాండ్‌ను కాపాడుకోవాలి

## దిశ సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :** నగరంలో నిధుల కొరత ఉన్నప్పటికీ.. లభ్యమవుతున్న నిధులను సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ, కేంద్ర సహాయ పథకాలు, ప్రాజెక్టుల అమలు స్థితిపై గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ అంటే కేవలం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ మాత్రమే కాదు.. నిజమైన హైదరాబాద్ బస్తీల్లో ఉంది. నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా రహదారులు జలమయమై ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల వర్షాల కారణంగా నాంపల్లిలో ఇద్దరు, సంతోష్‌నగర్‌లో ఒకరు నాలాలో కొట్టుకుపోవడం దురదృష్టకరం. ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు- అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పనిచేసి.. నగర ప్రాధాన్యతను గుర్తుంచుకొని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుకోవాలని సూచించారు. ఏ బస్తీకి వెళ్లినా వర్షపు నీరు, వరదలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అనేక ప్రాంతాల్లో డ్రైనేజీ సిస్టం దెబ్బతిని.. తాగునీటిలో కలిసిపోతోంది. అన్నీ రిస్టోర్ చేసి శుభ్రం చేయాలి. స్కూల్స్, కమ్యూనిటీ హాళ్లు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్టల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించుకోవాలని కిషన్‌రెడ్డి అన్నారు. దిశ సమావేశంలో ఎంపి ఈటెల రాజేందర్ సహా పలువురు నేతలు, కలెక్టర్ హరిచందన తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

- 21 వేయి స్తంభాల ఆలయంలో తొలి బతుకమ్మ
- గిన్నిస్ బుక్‌లో చోటు దక్కేలా సంబరాలు
- మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :** బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి అని, ప్రకృతిని గౌరవించడం, ప్రకృతిని కాపాడటం మనందరి బాధ్యత అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ పండుగలో పెద్దఎత్తున పాల్గొని ప్రపంచానికి చాటి చెప్పాలని తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు బతుకమ్మ పండుగ సంబరాలు జరుగుతాయని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. ఈ నెల 21వ తేదీన వరంగల్ జిల్లాలోని వెయ్యి స్తంభాల ఆలయం వద్ద బతుకమ్మ సంబరాలు ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు. గిన్నిస్ బుక్ రికార్డులో చేరే విధంగా సంబరాలు నిర్వహిస్తామని తెలిపారు. గురువారం గాంధీభవన్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియాతో మాట్లాడారు. బతుకమ్మ పండుగ బాధల నుంచి పుట్టిందని చరిత్రలో ఉందని వివరించారు. కొత్తగా కవులను, రచయితలను పిలిచి వారితో చర్చించి బతుకమ్మ పాటలు పాడేలా ప్లాన్ చేస్తామని పేర్కొన్నారు. బతుకమ్మ జరిగే ప్రాంతంలో ఘనంగా ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో కూడా మన సంస్కృతి తెలిసేలా ఏర్పాట్లు- చేస్తున్నామని చెప్పుకొచ్చారు. బతుకమ్మ పండుగలో ప్రజలు అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. బతుకమ్మ పండుగ చేసుకున్న తర్వాత చెరువులో వదలాలని...అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. బతుకమ్మ పండుగపై అవగాహన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. బతుకమ్మ పండుగ ముఖ్య ఉద్దేశం అందరూ కలిసి ఆత్మీయంగా చేసుకోవాలని. ఇది వ్యక్తుల కార్యక్రమం కాదు అందరి పండుగ అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. కొందరు బతుకమ్మ పండుగను రాజకీయం చేశారని టీ-పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. వివిధ రకాల పాటలతో బతుకమ్మను రాజకీయం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. తెలంగాణ సంప్రదాయం బతుకమ్మ పండుగ అని ఉద్ఘాటించారు. మొదటిరోజు చేసుకునే ఎంగిలి పువ్వు బతుకమ్మ దగ్గరి నుంచి చివరి సద్దుల బతుకమ్మ వరకు ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకొని కాంగ్రెస్ శ్రేణులు ముందుకు వెళ్లాలని సూచించారు. బతుకమ్మ పండుగపై కొన్ని అపోహలు ఉన్నాయని అన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ పండుగ.. తెలంగాణ సంప్రదాయమని చెప్పుకొచ్చారు. బతుకమ్మ పండుగలో ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో బతుకమ్మ కుంట బతుకమ్మ కోసం మళ్లీ వచ్చిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



# మేడారం జాతరకు మాస్టర్ ప్లాన్ ఖరారు

## మంత్రులు పొంగులేటి, సీతక్క, అడ్లూరి

**హైదరాబాద్:** మేడారం జాతరకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ ఖరారు చేసినట్టు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. ఆదివాసీ గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగా సమ్మక్క సారలమ్మ గద్దెల ఆధునికీకరణ, భక్తులకు సౌకర్యాలు వంటి అంశాలతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసినట్టు మంత్రులు వెల్లడించారు. మాస్టర్‌ప్లాన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదించగానే అభివృద్ధి పనులు ప్రారంభించి వందరోజుల్లో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనులకు త్వరలో సీఎం శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. మేడారం మాస్టర్ ప్లాన్‌పై మంత్రులు పొంగులేటి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ సమీక్ష నిర్వహించారు. గద్దెల అభివృద్ధి, సమ్మక్క, సారలమ్మ ప్రధాన ద్వారం, ప్రహరీగోడ నిర్మాణ డిజైన్లపై చర్చించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన కార్యచరణ ప్రణాళికను రెండు రోజుల్లో సమర్పించాలని మాస్టర్‌ప్లాన్ తయారు చేసిన కన్సల్టెన్సీని మంత్రులు ఆదేశించారు. అధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులు మేడారం వెళ్లి పూజారులు, స్థానిక ప్రజల అభిప్రాయాలను తీసుకొని గద్దెల డిజైన్ తయారు చేసినట్లు మంత్రులు చెప్పారు. గతంలో పగిడిద్దరాజు, గోవిందరాజుల దర్శనం సరిగా జరగక.. భక్తులు ఇబ్బందిపడ్డారన్న మంత్రులు.. ఆ సమస్య పరిష్కారానికి గద్దెల ప్రాంగణాన్ని విస్తరిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందిన ఈ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమ్మక్క సారలమ్మల త్యాగం, ఔన్నత్యం మరింత చాటి చెప్పేలా ఆలయ ప్రాంగణం రూపకల్పన జరుగుతోందని తెలిపారు. మేడారం ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల్లోని అన్ని దేవాలయాలను శోభాయమానంగా తీర్చిదిద్దుతామని మంత్రి పొంగులేటి తెలిపారు. సమావేశంలో సీఎం ముఖ్యకార్యదర్శి శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో బచ్చాగాడిని పెట్టి గెలిపిస్తా

- అసెంబ్లీ ఎన్నికలు కాదు.. జూబ్లీహిల్స్ గురించి మాట్లాడు
- పార్లమెంటులో ఎంత వచ్చిందో, లోకల్ బాడీలో కూడా అంతే : మంత్రి పొంగులేటి



**ఖమ్మం, సెప్టెంబర్ 18 :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన ఇష్టం వచ్చినట్లు కాంగ్రెస్ పార్టీపై మాట్లాడుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. మూడున్నరేళ్ల తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికల గురించి కాకుండా, తక్షణంలో జరిగే జూబ్లీహిల్స్ ఉపఎన్నికల గురించి కేటీఆర్ ఆలోచించాలని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో బచ్చా గాడిని పెట్టి గెలిపిస్తానంటూ కేటీఆర్‌కు పొంగులేటి సవాల్ విసిరారు. "మూడున్నరేళ్ల తర్వాత నువ్వు ఇండియాలో ఉంటావా? లేక విదేశాల్లో ఉంటావా?" అంటూ విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో వీఆర్ఎస్(విఠీ పార్టీ)కు ఎన్ని సీట్లు వచ్చాయో, స్థానిక ఎన్నికల్లో కూడా అంతే వస్తాయని వ్యాఖ్యానించారు. ఖమ్మం రూరల్‌లో నిర్వహించిన సమావేశంలో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. "రాబోయే ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గంలో నేను ఎలా గెలుస్తానో చూద్దాం" అన్న కేటీఆర్ వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. "మా సీఎం రేవంత్ రెడ్డి ఎంత కష్టపడుతున్నారో అందరికీ తెలుసు. అధికారంలో ఉన్నప్పుడు కనిపించనిది, వినిపించనిది ప్రతిపక్షంలో ఉంటే విడ్డూరంగా ఉంది. విభజన సమయంలో రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీ కాంగ్రెస్. అప్పట్లో మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పులలో ముంచింది. మేము పేదల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే కొంతమంది విషం కక్కుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుంటే వీఆర్ఎస్ నాయకులకు కడుపు మంట ఎందుకు?" అని ప్రశ్నించారు. "కమిషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టులు కడతారు కానీ, పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని ఎందుకు అనుకోలేదు? పేదోడికి ఇల్లు కట్టించి ఉంటే వీఆర్ఎస్ పరిస్థితి ఇవాళ ఇలాగే ఉండేది కాదు. పాముకు కోరల్లో మాత్రమే విషం ఉంటుంది, వీఆర్ఎస్‌కి ఒళ్లంతా విషంతో నిండి ఉంది," అని ఎద్దేవా చేశారు. "రెండు పర్యాయాలు వీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాం. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బుద్ధి చెప్పాలి. వీరి కుటుంబ సమస్యను రాష్ట్ర సమస్యలా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. వీరి సోదరి సమస్య, బిడ్డ సమస్యను మా సీఎం రేవంత్ రెడ్డికి అంటగడుతున్నారు. మొన్న ట్విట్టర్‌లో టిల్లు ఏదో మాట్లాడుతున్నాడు. మూడున్నరేళ్ల తర్వాత జరిగే ఎన్నికల గురించి కాదు, ప్రస్తుతం ఏమౌతోందో తెలుసుకో." "వీఆర్ఎస్ పార్టీ శాసన సభ్యుడు ఆరోగ్య కారణాలతో చనిపోయారు. 15 రోజుల్లో ఉపఎన్నికల షెడ్యూల్ వస్తుంది. వీఆర్ఎస్‌కు ఉన్న పరిజ్ఞానం గురించి నేను మాట్లాడను. కేటీఆర్.. ముందుగా జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలిచి చూపు. బచ్చా గాడిని పెట్టి గెలిపిస్తానంటావు. మూడున్నరేళ్ల తర్వాత నువ్వు ఇండియాలో ఉంటావా లేక విదేశాలకు వెళ్తావా చూద్దాం. జూబ్లీహిల్స్ తర్వాత వీఆర్ఎస్ పార్టీ స్థానం ఏంటో తేలిపోతుంది, నాయనా ట్విట్టర్ టిల్లు!" "వీఆర్ఎస్ దయ, దాక్షిణ్యాలతో ఎవరు బీఫామ్ తీసుకోలేదు. మీ నాయన మూడు సార్లు వచ్చి ముక్కు నేలకు రాసినా ఏమి చేయలేకపోయాడు. నువ్వెంత బచ్చాగాడివి? కాంగ్రెస్ పార్టీ ఆషామాషీ పార్టీ కాదు. ఇచ్చిన మాట కోసం నిలబడే, నెరవేర్చే పార్టీ. ఈ పార్టీలో ఎవ్వరూ తప్పు చేయరు. తలకిందులుగా వేసిన పార్లమెంట్ ఎన్నికల్లో వీఆర్ఎస్‌కి ఎంత వచ్చినా, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అంతే సీట్లు వస్తాయని" మంత్రి పొంగులేటి అన్నారు.

# బంధుప్రీతి లేని ఏకైక ప్రదేశం 'సైన్యం'

## సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్



**రాంచీ :** బంధుప్రీతి లేని ఏకైక ప్రదేశం సైన్యమేనని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. రాంచీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ.. దేశసేవ చేయాలంటే సైన్యంలో చేరాలన్న లక్ష్యం పెట్టుకోవాలని చిన్నారులకు సూచించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది ప్రకృతి విపత్తు ఘటనల్లో అనేక మంది పౌరులను రక్షించేందుకు సైన్యం కృషి చేసిందన్నారు. "బంధుప్రీతి లేని ఏకైక ప్రదేశం సైన్యం. దేశసేవ చేయాలనుకుంటే, దేశంతోపాటు ప్రపంచాన్ని అన్వేషించాలనుకుంటే త్రివిధ దళాల్లో చేరడం లక్ష్యంగా పెట్టుకోవాలి. ఇక్కడ కష్టపడితే గుర్తింపు తప్పకుండా వస్తుంది" అని జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. చిన్నారులతో ముచ్చటించిన ఆయన.. ఈ ఏడాది ప్రకృతి విలయ సంఘటనలు అధికంగా చోటుచేసుకున్న నేపథ్యంలో రెస్క్యూ ఆపరేషన్లలో అనేక మందిని రక్షించేందుకు సాయుధ దళాలు తీవ్ర కృషి చేశాయన్నారు. ఆపరేషన్ సిందూర్ గురించి సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ మాట్లాడుతూ.. మే 7న అర్ధరాత్రి శత్రు స్థావరాలపై దాడులు చేశామని, ఒంటి గంటకు తొలి దాడి జరిగిందని చెప్పారు. సుదీర్ఘ లక్ష్యాలపై రాత్రి వేళల్లో దాడులు చేయాలంటే ప్రత్యేక కృషి అవసరమన్నారు.

# హిండెన్‌బర్గ్ ఆరోపణలు.. గౌతమ్ అదానీకి సెబీ క్లీన్‌చిట్




**న్యూఢిల్లీ :** హిండెన్‌బర్గ్ ఆరోపణలపై ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ, ఆయన కంపెనీలకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి క్లీన్‌చిట్ లభించింది. స్టాక్ అవకతవకలు, అకౌంటింగ్ మోసాలకు పాల్పడుతోందంటూ అమెరికా షార్ట్ సెల్లర్ చేసిన ఈ ఆరోపణల్లో నిజం లేదని సెబీ స్పష్టంచేసింది. అదానీ గ్రూప్ తన లిస్టెడ్ కంపెనీల్లోకి అక్రమంగా నిధులు మళ్లించిందనడానికి ఎలాంటి ఆధారాల్లేవని పేర్కొంది. ఈ మేరకు ఇన్‌సైడర్ ట్రేడింగ్, మార్కెట్ మ్యానిపులేషన్, పబ్లిక్ షేర్ హోల్డింగ్ నిబంధనల ఉల్లంఘన వంటి అంశాలకు సంబంధించి గురువారం రెండు వేర్వేరు ఉత్తర్వులు వెలువరించింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్‌తో పాటు ఆ గ్రూప్‌నకు చెందిన ఇతర కంపెనీలపైనా హిండెన్‌బర్గ్ సంస్థ 2023 జనవరిలో తీవ్ర ఆరోపణలు చేసింది. అదానీ పవర్ లిమిటెడ్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ వంటి లిస్టెడ్ కంపెనీల్లో నిధుల మళ్లింపునకు అడికార్ప్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్, మైల్‌స్టోన్ ట్రేడ్‌లింక్స్ ప్రైవేట్ లిమిటెడ్, రెహ్వార్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలను అదానీ గ్రూప్ వినియోగించిందని ఆరోపించింది. అదానీ గ్రూప్ కంపెనీలతో జరిగిన లావాదేవీల్లో ఎలాంటి నిబంధనల ఉల్లంఘనా జరగలేదని సెబీ బోర్డు సభ్యుడు కమలేష్ సీ వార్ష్ణీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మదుపర్లను తప్పుదోవ పట్టించేలా ఎలాంటి నిబంధనల ఉల్లంఘనా జరగలేదని సెబీ స్పష్టంచేసింది. అదానీ గ్రూప్ సంస్థలు గానీ, ఎగ్జిక్యూటివ్‌లు గానీ ఎలాంటి తప్పూ చేయలేదని, జరిమానా విధించాల్సిన అవసరం లేదని తెలిపింది.

# లలిత్ మోదీ సోదరుడి అరెస్టు



**న్యూఢిల్లీ :** లలిత్ మోదీ సోదరుడు, వ్యాపారవేత్త సమీర్ మోదీని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. అత్యాచారం కేసులో అతడిని అరెస్టు చేసినట్లు సమాచారం. విదేశాలకు వెళ్తున్న సమయంలో ఢిల్లీ ఎయిర్‌పోర్టులో అతడిని కస్టడీలోకి తీసుకున్నట్లు అధికా రులు వెల్లడించారు. గతంలో సమీర్‌తో సహజీవనం చేసిన మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదైనట్లు సంబంధిత వర్గాల సమాచారం. సౌత్ ఈస్ట్ ఢిల్లీలో ని న్యూ ఫ్రెండ్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో సమీర్ మోదీపై కేసు నమోదైంది. అరెస్టు తర్వాత కోర్టు ముందు హాజరుపరచగా.. సమీర్‌కు ఒకరోజు జ్యుడిషియల్ కస్టడీ విధించినట్లు తెలిసింది. సెప్టెంబర్ 19న మరోసారి కోర్టు ముందు హాజరు పరచనున్నారు. ఈ కేసును సెటిల్ చేసుకునేందుకు సదరు మహిళ రూ.50 కోట్లు డిమాండ్ చేసినట్లు సమాచారం. అయితే, ఈ వ్యవహారంపై ఢిల్లీ పోలీసుల నుంచి అధికారికంగా ఎటువంటి ప్రకటన వెలువడలేదు. మరోవైపు ఐపీఎల్‌కు బాస్‌గా ఉన్న సమయంలో కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేశాడని లలిత్ మోదీ ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. దీంతో 2010లో లండన్‌కు పారిపోయిన అతడు.. అప్పటి నుంచి అక్కడే ఉంటున్నాడు. తిరిగి స్వదేశానికి రప్పించేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే.

# భారత్, మోదీతో మంచి స్నేహం ఉంది : ట్రంప్



**యూఎస్ :** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న కారణంగా భారత్‌పై అదనపు సుంకాలు విధిస్తున్న ట్రంప్ .. తాజాగా మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బ్రిటన్ పర్యటనలో ఉన్న ఆయన.. భారత్‌తో మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. మోదీతోనూ మంచి స్నేహం ఉందన్నారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో ద్వైపాక్షిక సమావేశం అనంతరం మీడియా సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. "భారత్‌తో మంచి సంబంధాలు ఉన్నాయి. ప్రధాని మోదీ నాకు సన్నిహితుడు. ఇటీవలే ఆయనతో మాట్లాడి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశా. మా ఇద్దరి మధ్య చాలా మంచి స్నేహం ఉంది. ఆయన కూడా ఓ అందమైన ప్రకటన చేశారు. అయినప్పటికీ వాళ్లపై ఆంక్షలు విధించా. చైనా ఇప్పుడు భారీ స్థాయిలో అమెరికాకు సుంకాలు చెల్లిస్తోంది. మరిన్ని వేయడానికి సిద్ధంగా ఉన్నా. చమురు కొనుగోలు ఆపివేస్తేనే రష్యా దిగివస్తుంది" అని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

# ప్రోటోకాల్ విస్మరించిన సిరిసిల్ల కలెక్టర్

## ఆదిశ్రీనివాస్ ఫిర్యాదుతో వివరణ కోరిన ప్రభుత్వం

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :** రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝాపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్ అయింది. బుధవారం ప్రజా పరిపాలన దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ప్రోటోకాల్ పాటించకపోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. జెండా ఆవిష్కరణ సమయానికి హాజరు కాకపోవడంతోపాటు- కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలకడంలో కలెక్టర్ నిర్లక్ష్యం వహించారు. ఈ విషయంపై బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీఎంవోకు ఆది శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. దీంతో ఈ సంఘటనకు సంబంధించి రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని కలెక్టర్‌కు నోటీసులు జారీ చేసింది ప్రభుత్వం. అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిబంధనలు పాటించకుండా వ్యవహరించిన తీరును సర్కార్ తప్పుబట్టింది. రోజురోజుకూ వివాదాస్పదంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మారుతున్నారని సర్కార్ సీరియస్ అయింది. ఓ భూ నిర్వాసితుడి విషయంలోనూ నిన్న కోర్టు ఆయనకు వారెంట్ జారీ చేసింది. ఈ క్రమంలో ఈరోజు(గురువారం) జిల్లావ్యాప్తంగా ఆది శ్రీనివాస్‌కు మద్దతుగా నిరసన తెలిపారు బీసీ సంఘాల నేతలు. ఈ మేరకు కలెక్టర్ సంజయ్ ఝాకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల్లోపు వివరణ ఇవ్వాలని సీఎస్ ఆదేశించారు. కలెక్టర్ ఇచ్చే వివరణను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం



# లోకల్ అభ్యర్థి గుర్తింపులను తేల్చండి : హైకోర్టు

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :** ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లలో లోకల్ అభ్యర్థి గుర్తింపు వివాదాన్ని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వనపర్తి జిల్లా విద్యార్థి శశికిరణ్ పిటిషన్‌పై న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ సైనిక్ స్కూల్‌లో చదివినా శశికిరణ్‌ను తెలంగాణ కోటా కింద పరిగణించాలని హైకోర్టు స్పష్టం చేసింది. అడ్వకేట్ జనరల్ సమాధానంతో ఈ కేసు ముగించింది. విద్యార్థికి వెబ్ ఆప్షన్ ఇచ్చేలా, కౌన్సెలింగ్‌కు పిలవాలని హైకోర్టు సూచించింది. సైనిక్ స్కూల్‌లో చదివిన తెలంగాణ విద్యార్థులకు పదేళ్ల వరకు రాయితీ కొనసాగించాలని ఆదేశించింది. అనంతరం పిటిషన్ డిస్పోజ్ చేసింది.



# యూరియా వైఫల్యం కేంద్రానిది

- ప్రభుత్వంపై బురదజల్లుతున్న బిఆర్ఎస్
- మండిపడ్డ మంత్రి సీతక్క

**ఖమ్మం, సెప్టెంబర్ 18 :** ప్రజల సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా, వైరా మున్సిపాలిటీలో పర్యటించిన మంత్రి సీతక్క మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ విమర్శలు చేసి బదనాం చేస్తోందని ఆరోపించారు. యూరియా సరఫరా చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని, రైతులను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ నిందలు వేస్తోందని ఆమె అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులమయం చేసిందని విమర్శించిన మంత్రి సీతక్క, తాము భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను, మహిళలకు వివిధ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరిన ఆమె, స్థానిక ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు.

# ఏఎస్పీలకు అడిషనల్ ఎస్పీలుగా ప్రమోషన్

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎస్పీలుగా పనిచేస్తున్న వారికి ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. అడిషనల్ ఎస్పీగా పదోన్నతులు కల్పిస్తూ అదే స్థానంలో కొనసాగాలని ఉత్తర్వులు ఇచ్చింది. వేములవాడలో ఏఎస్పీగా పనిచేస్తున్నశేషాద్రిని రెడ్డి అదే స్థానంలో అడిషనల్ ఎస్పీగా , బైంసాలో ఉన్న అవినాష్ కుమార్‌ను, ఏటూరునాగారంలో ఏఎస్పీగా పనిచేస్తున్న శివం ఉపాధ్యాయను, భువనగిరిలో ఉన్న కంకణాల రాహుల్ రెడ్డిని, ఉట్నూర్‌లో ఏఎస్పీగా పనిచేస్తున్నకాజల్ సింగ్‌కు అడిషనల్ ఎస్పీలుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# అల్మట్టి ఎత్తు పెంచుతున్నా పట్టించుకోరా?

- కృష్ణా జలాల వాటా వదులుకోమన్న సీఎం చేస్తున్నదేంటి?
- సీఎం రేవంత్ తీరుపై మండిపడ్డ మాజీ ఎంపీ వినోద్ కుమార్



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :** అల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం యత్నిస్తుంటే, ఇప్పటికీ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందించకపోవడంపై బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ అంశంపై తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు. కృష్ణా ట్రిబ్యునల్ 2013లో అల్మట్టి ప్రాజెక్టు ఎత్తుకు సంబంధించి తీర్పు ఇచ్చింది. సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ తీర్పుపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఆందోళనల నేపథ్యంలో అప్పటి ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ వేయగా, ట్రిబ్యునల్ తీర్పుపై స్టే వచ్చింది. 2014లో తెలంగాణ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టు స్టే కొనసాగించేలా చర్యలు చేపట్టింది. సుప్రీంకోర్టు స్టే ఉండగానే కర్ణాటక ప్రభుత్వం అల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు ప్రయత్నిస్తోంది. నిన్న కర్ణాటక ప్రభుత్వం అల్మట్టి ప్రాజెక్టు విస్తరణ కోసం లక్షా 33 వేల ఎకరాల భూ సేకరణ చేయాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించింది. ఈ భూ సేకరణ కోసం రెండేళ్లలో రూ. 70 వేల కోట్లు ఖర్చు పెట్టాలని కర్ణాటక లక్ష్యంగా పెట్టుకుంది. కర్ణాటకలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే. అల్మట్టిపై కర్ణాటక నిర్ణయం తీసుకుని రెండు రోజులు అయినా సీఎం రేవంత్ రెడ్డి ఇంకా స్పందించలేదు. సుప్రీంకోర్టు స్టే పెండింగ్‌లో ఉండగానే కర్ణాటక అల్మట్టి ఎత్తు పెంచడానికి తీసుకున్న నిర్ణయంపై తక్షణమే మన రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలన్నారు మాజీ ఎంపీ వినోద్ కుమార్. కృష్ణా నదిలో ఒక్క నీటి చుక్కను వదలమని ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి ఓ సమీక్ష సమావేశంలో చెప్పారు. మరి కర్ణాటక అక్రమంగా అల్మట్టి ఎత్తు పెంచుతుంటే రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదు? మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ కర్ణాటక నిర్ణయంపై స్పందించారు. అల్మట్టి ఎత్తు పెంచితే తమ రాష్ట్రంలోని రెండు జిల్లాలు – సాంగ్లీ, కొల్హాపూర్ – ముంపు ఉంటాయని మహారాష్ట్ర సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. "అల్మట్టి ఎత్తు పెంపును ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోము, అడ్డుకోతాం" అని ఫడ్నవీస్ హెచ్చరించారు అని వినోద్ కుమార్ గుర్తు చేశారు. కేసీఆర్‌పై ద్వేషమే తప్ప రేవంత్ రెడ్డికి కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయం చేయాలన్న లక్ష్యం లేదు. కేసీఆర్ పట్టుదలతోనే సెక్షన్ 3 ప్రకారం కృష్ణా ట్రిబ్యునల్‌లో వాదనలు జరిగాయి. కేసీఆర్ కృష్ణా ట్రిబ్యునల్ కోసం 33 లేఖలు కేంద్ర ప్రభుత్వానికి రాశారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తగ్గించారని కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి పదే పదే నిందలు వేస్తున్నారు. నిన్న కూడా సెప్టెంబర్ 17 వేడుకల ప్రసంగంలో కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి విషం చిమ్మారు. తెలంగాణ ఏర్పడి నెల రోజులకే కేసీఆర్ కేంద్ర ప్రభుత్వానికి కృష్ణా ట్రిబ్యునల్ ఏర్పాటుకు లేఖ రాశారు. కృష్ణా ట్రిబ్యునల్ ఏర్పాటును మహారాష్ట్ర, కర్ణాటక వ్యతిరేకించినా, చివరకు కేసీఆర్ మాటే నెగ్గింది. కేసీఆర్‌పై నిందలు మాని, అల్మట్టిపై కర్ణాటక దూకుడును రేవంత్ రెడ్డి అడ్డుకోవాలి. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందుకే రేవంత్ రెడ్డి మౌనంగా ఉన్నారా? రేవంత్ రెడ్డి ఇప్పటికైనా సుప్రీంకోర్టులో కర్ణాటకకు వ్యతిరేకంగా కంటెంప్ట్ పిటిషన్ వేయాలి. అల్మట్టి ఎత్తు పెరిగితే తెలంగాణకు భారీ నష్టం వాటిల్లుతుంది. రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన స్పందించాలి అని మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు.



## కుమారుడి రిసెప్షన్ రద్దు చేసి.. సీఎంకు విరాళమిచ్చిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్18 :** తన నియోజకవర్గంలోని రైతుల కోసం ఖర్చు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబసభ్యులు విరాళం అందించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌ను లక్ష్మారెడ్డి కలిసి రూ.2కోట్ల చెక్ అందజేశారు. లక్ష మంది రైతులకు ఒక్కో యూరియా బస్తా ఉచితంగా అందించాలని సీఎంను ఆయన కోరారు. ఇటీవల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కుమారుడు సాయి ప్రసన్న వివాహం జరిగింది. మిర్యాలగూడలో భారీ ఎత్తున రిసెప్షన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే భావించారు. కానీ రిసెప్షన్‌ను రద్దు చేసుకుని ఆ డబ్బును రైతుల కోసం ఖర్చు చేసేందుకు ఆయన ముందుకు వచ్చారు. లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబసభ్యులను సీఎం అభినందించారు.



## సిఎంతో బ్రిటిష్ హైకమిషనర్ లిండీ భేటీ

### తెలంగాణ విద్యార్థులకు సహకారం ఇస్తామని హామీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :** భారత బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా యూకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే చెవెనింగ్ స్కాలర్‌షిప్‌ను కో–ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు లిండీ కామెరాన్ అంగీకరించారు. ఎడ్యుకేషన్, టెక్నాలజీ సంబంధిత రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రికి బ్రిటిష్ హైకమిషనర్ వివరించారు. యూకే యూనివర్సిటీల్లో చదువుకునే తెలంగాణ విద్యార్థుల సౌకర్యార్థం, హైదరాబాద్ నుంచి అక్కడి యూనివర్సిటీలు ఆపరేట్ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ సందర్భంగా తెలంగాణలో తీసుకురాబోతున్న కొత్త ఎడ్యుకేషన్ పాలసీ డ్రాఫ్ట్‌ను కూడా బ్రిటిష్ హైకమిషనర్‌కు సీఎం వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు ట్రైనింగ్ అందించేందుకు బ్రిటిష్ హైకమిషనర్ సుముఖత వ్యక్తం చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో బ్రిటిష్ కంపెనీలు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి కోరారు. జీసీసీ, ఫార్మా, నాలెడ్జ్, అకాడమీ విభాగాల్లో పెట్టుబడులకు ముందుకు రావాలని సీఎం కోరగా, అందుకు బ్రిటిష్ హైకమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశానికి డిప్యూటీ హైకమిషనర్ హైదరాబాద్ గారెత్ విన్ ఓవెన్, పొలిటికల్ ఎకానమీ అడ్వైజర్ నళిని రఘురామన్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి హాజరయ్యారు.

## వామనరావు దంపతుల హత్య కేసు

### మంథని కోర్టులో సమాచారం తీసుకున్న సిబిఐ

**పెద్దపల్లి, సెప్టెంబర్ 18 :** రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించిన అడ్వకేట్ వామన్ రావు దంపతుల హత్య కేసులో సిబిఐ విచారణ ప్రారంభమైంది. వామన్ రావు దంపతుల హత్య కేసుకు సంబంధించిన విచారణ నిమిత్తం గురువారం సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అధికారులు మంథని కోర్టులో ప్రభుత్వ సమాచారాన్ని తీసుకున్నారు. అంతేకాకుండా వామన్ రావు స్వగ్రామమైన గుంజపడుగు వెళ్లి వివరాలను సేకరించారు. హైకోర్టు న్యాయవాదులు గట్టు వామన్‌రావు దంపతుల హత్య కేసులో ఏడుగురు నిందితులు బెయిల్‌పై ఉన్నారు. వామన్‌రావు దంపతుల హత్య కేసులో మాజీ ఎమ్మెల్యే హస్తం ఉందని తండ్రి కిషన్‌రావు ఆరోపణల నేపథ్యంలో సిబిఐ అధికారులు విచారణ ప్రారంభించారు. అనంతరం మంథని కోర్టు ప్రాంగణంలో వామన్ రావు తండ్రి కిషన్ రావు, తమ్ముడు చంద్రశేఖర్ నుంచి వివరాలను సిబిఐ అధికారులు సేకరించారు. హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించనున్నారు.

## ప్రభుత్వంపై బతుకమ్మ పాటలతో విమర్శలు

- మూడు పాటలను రాయించిన బీఆర్ఎస్
- పాటలు విడుదల చేసిన కేటీఆర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :** ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ బీఆర్ఎస్ రూపొందించిన బతుకమ్మ పాటల సీడీని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విడుదల చేశారు. ఇవన్నీ రాజకీయ పాటలే కావడం గమనార్హం. పండుగ పూట సర్కారును విమర్శిస్తూ "ఉయ్యాల" అన్న చరణంతో ఈ పాటలను వండివార్చారు. "మార్పు మార్పని వలలో మనల్ని ముంచిన వలలో..." అంటూ ఒక పాట, "మార్పు మార్పని మనం చేయి గుర్తుకు ఓటేస్తే..." అంటూ మరో పాట, "ఆరు గ్యారెంటీలు ఉయ్యాలో, ఆగమే చేశింద్రు ఉయ్యాలో..." అంటూ మూడవ పాటను ఈ సందర్భంగా కేటీఆర్ ఆవిష్కరించారు. బతుకమ్మ పండుగ అంటే తెలంగాణ ఆత్మ. ఈ గడ్డకు పరిమితమైన పూల సింగిడి. ఇది ఆడబిడ్డల పండుగ. పండగ సందర్భంగా పురాణ గాథలు, కథలు, రామాయణ–మహాభారత ఘట్టాలను పాటలుగా పాడుతూ ఉంటారు. తరతరాలుగా వస్తున్న బతుకమ్మ పాటల మాదిరిగా కాకుండా, ఈ సారి బీఆర్ఎస్ రాజకీయ విమర్శలతో కూడిన పాటలను రచించి, పాడించి, విడుదల చేసింది. ఈ పాటలు నిజంగా బతుకమ్మ సంధర్భంలో పాడతారా? పాడతారా లేదా అన్నది పక్కన పెడితే బతుకమ్మ లాంటి సంప్రదాయ పండుగను రాజకీయ వేదికగా వాడుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొన్నటి వరకు "బతుకమ్మను విశ్వవ్యాప్తం చేసింది కవితమ్మ.. బ్రాండ్ అంబాసిడర్ ఆమెనే" అని చెప్పినవారు, ఇప్పుడు సడెన్‌గా "బతుకమ్మకు బ్రాండ్ అంబాసిడర్ కేసీఆర్" అని పాటల విడుదల సందర్భంగా చెప్పడం గమనార్హం. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ "బతుకమ్మను తెలంగాణ నుంచి వేరు చేసి, రేవంత్ రెడ్డి మహిళల హృదయాలను గాయపరిచారు. ఈ నేల స్వభావం తెలిసిన పాలన మళ్లీ రావాలి" అని అన్నారు. పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ "ఈ మూడు పాటలను ప్రత్యేకంగా రాయించామని" చెప్పారు. "బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించాము" అన్నారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ "కోటిమంది మహిళలను బతుకమ్మ చీరలతో గౌరవించిన నాయకుడు కేసీఆర్. తన పాలనలో ఆడపడుచులను కన్నతండ్రిలా చూసుకున్నారు" అన్నారు. "కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలంగాణ తల్లి చేతిలోని బతుకమ్మ మాయమైపోయింది" అని విమర్శించారు.
నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ "ప్రభుత్వ కార్యాలయాల్లో బతుకమ్మ ఆడుకునే అవకాశం కేసీఆర్ ఇచ్చారు" అన్నారు. మాజీ ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ "బతుకమ్మ పండుగ కోసం లంబాడీ ఆడబిడ్డలు ఎదురుచూస్తుంటారు" అన్నారు. తెలంగాణ జాగృతి సంస్థ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు బతుకమ్మ పండుగను కల్వకుంట్ల కవితే నిర్వహిస్తూ వచ్చారు. ఆమె ప్రత్యేకంగా పాటలు సిద్ధం చేయించారు. అప్పట్లో విడుదలైన పాటల్లో రాజకీయాలకు తావులేకుండా, బతుకమ్మ ప్రాశస్త్యాన్ని వివరించే అంశాలే ఉండేవి. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ విడుదల చేసిన బతుకమ్మ పాటలన్నీ రాజకీయ ధోరణిలో ఉండడం విమర్శలకు తావిస్తోంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను ఆమె పుట్టిన ఊరు సిద్దిపేట జిల్లా చింతమడక బతుకమ్మ పండుగకు ఆహ్వానించింది. ఈ నెల 21న నిర్వహించే ఎంగిలిపూల బతుకమ్మ పండుగకు రావాలని గ్రామస్తులు ఆమెను ఆహ్వానించారు. ఒకవైపు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ రాజకీయ బతుకమ్మ పాటలను విడుదల చేయడం, మరోవైపు కవిత చింతమడక బతుకమ్మ పండుగకు వెళ్లడం ఈ రెండు అంశాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

## పిల్లలకు విలువలను వారసత్వంగా ఇవ్వండి

- మహనీయుల చరిత్రలను తెలియచేయండి
- సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణలో ఎంపీ ఈటల



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :** పిల్లలకు వారసత్వంగా ఆస్తులు కాకుండా విలువలు, సంప్రదాయాలు, దేశభక్తిని నేర్పించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. కన్నవారిని, కన్నపిల్లలను, జీవిత భాగస్వామిని చంపుకుంటున్న ఘటనలు కలచివేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మన విలువలే మనల్ని ఇలాంటి దురాగతాల నుంచి కాపాడతాయని హెచ్చరించారు. ఉప్పల్ నియోజకవర్గం కాప్రాలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆత్మగౌరవం, దేశభక్తి విలువలు గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తమ ఆత్మగౌరవం కోసం ఎమ్మెల్యే పదవిని గడ్డిపోచలా వదిలివేశామని ఈటల రాజేందర్ అన్నారు. ఆత్మగౌరవం కోల్పోయి వచ్చే ఏ పదవి అయినా విలువలేనిదని ఆయన స్పష్టం చేశారు. స్వయంపాలన కోసమే తాము 20 ఏళ్లలో ఆరుసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచామని గుర్తు చేసుకున్నారు. ఈ ఘటనలు ఎక్కడో జరుగుతున్నాయని అనుకోవద్దని, అవి మన ఇంటి గడపను కూడా తట్టే అవకాశం ఉందని హెచ్చరించారు. మహనీయుల విగ్రహాలను స్థాపించడం, జయంతులు, వర్ధంతులు చేసుకోవడం కేవలం దండ వేయడానికి మాత్రమే కాదని, వారి చరిత్రను భావితరాలకు అందించడం కోసమని ఈటల అన్నారు. తెలంగాణ ప్రజల రక్త తర్పణాన్ని గుర్తుచేస్తూ, భారత స్వాతంత్ర్యం కోసం లక్షల మంది చేసిన పోరాటాలను, త్యాగాలను ఆయన కొనియాడారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ గురించి మాట్లాడుతూ, ఆయన గొప్ప మేధావి అని, తన ప్రాణం భారత జాతి విముక్తి కోసమేనని పోరాడారని ప్రశంసించారు. భారతదేశంలో సాధ్యం కాకపోవడంతో వేరే దేశానికి వెళ్లి 'ఆజాద్ హింద్ ఫౌజ్' స్థాపించి దేశం కోసం ప్రాణాలు అర్పించారని కొనియాడారు. నేటి తరానికి స్వాతంత్ర్య వేడుకల ప్రాముఖ్యత తెలియడం లేదని, వారు పుస్తకాలు చదవక, చరిత్రను తెలుసుకోలేకపోతున్నారని ఈటల రాజేందర్ విచారం వ్యక్తం చేశారు.

## విమాన రెక్కల్లో ఇరుక్కుపోయిన పక్షి

### చాకచక్యంగా కిందకు దింపిన పైలట్

**విశాఖపట్నం, సెప్టెంబర్ 18 :** ఈ మధ్యకాలంలో పలు విమానాలు పెను ప్రమాదాల నుంచి తృటిలో తప్పించుకుంటున్నాయి. తాజాగా ఎయిరిండియాకు చెందిన ఎక్స్‌ప్రెస్ విమానం పెను ప్రమాదం నుంచి తప్పించుకుంది. విశాఖ నుంచి మధ్యాహ్నం 2.20 గంటలకు విమానం హైదరాబాద్‌కు బయలు దేరింది. టేకాఫ్ అయిన కొంత సమయానికే విమాన రెక్కలలో ఓ పక్షి ఇరుక్కుపోయింది. పక్షి ఇరుక్కోవడంతో విమాన ఇంజిన్ ఫ్యాన్ రెక్కలు దెబ్బ తిన్నాయి. ఇది గమనించిన పైలట్ చాకచక్యంగా విమానాన్ని వెనక్కి తీసుకొచ్చి ల్యాండ్ చేశారు. దీంతో విమానం పెను ప్రమాదం తప్పింది. ఘటన జరిగిన సమయంలో విమానంలో మొత్తం 103 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులకు ఎయిరిండియా యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి గమ్యస్థానానికి చేరుస్తుంది.

## ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మారిస్తే మరో లగచర్ల ఘటన రిపీట్ : కెటిఆర్

**వికారాబాద్, సెప్టెంబర్ 18 :** రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్రంగా స్పందించారు. రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు మారుస్తోందని ప్రశ్నల వర్షం కురిపించారు. అలైన్‌మెంట్‌ను మార్చి రోడ్డు నిర్మాణం చేపడితే మరో లగచర్ల ఘటన రిపీట్ అవుతుందని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కేటీఆర్ హెచ్చరించారు. గతంలో ఆమోదించిన రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం అలైన్‌మెంట్‌ని మార్చి సర్వే నెంబర్లను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించింది. అయితే, గతంలో నిర్మించ తలపెట్టిన మార్గంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు ఉండటంతో అలైన్‌మెంట్‌ను మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వం. అలైన్‌మెంట్ మార్పుతో రైతులు భారీగా భూములు కోల్పోతున్నారు. ఈ విషయంపై వారం రోజులుగా వివిధ పద్ధతుల్లో నిరసన వ్యక్తం చేశారు అన్నదాతలు. అధికారులు తమను పట్టించుకోవడం లేదని కేటీఆర్‌ను కలిశారు. మోమిన్‌పేట మండల గ్రామాల రైతులు. అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఫోన్‌లో మాట్లాడారు కేటీఆర్. పేద రైతుల భూములను గుంజుకొని వారికి అన్యాయం చేస్తే మరో లగచర్ల ఘటన చోటు చేసుకుంటుందని కలెక్టర్‌ను హెచ్చరించారు. అయితే, కలెక్టర్‌ను హెచ్చరించిన వీడియో వికారాబాద్ జిల్లా వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తోంది.




## రియల్‌మనీ గేమింగ్ బ్యాన్ ఎఫెక్ట్..

### గేమ్స్‌క్రాఫ్ట్‌లో ఉద్యోగుల తొలగింపు

**ఢిల్లీ:** ఆన్‌లైన్ గేమింగ్ సంస్థ గేమ్స్‌క్రాఫ్ట్ 120 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. రియల్‌మనీ గేమింగ్‌పై నిషేధం విధిస్తూ కేంద్రప్రభుత్వం బిల్లు తీసుకొచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. గేమింగ్ బిల్లు కారణంగా ఈ రంగంపైనా, గేమ్స్‌క్రాఫ్ట్‌పైనా తీవ్ర ప్రభావం పడిందని కంపెనీ పేర్కొంది. దీంతో తమ సేవలు పూర్తిగా నిలిచిపోయాయని తెలిపింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో సంస్థలో పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ చేపట్టాల్సిన వచ్చిందని వివరించింది. ఈ ప్రక్రియలో భాగంగా టీమ్స్, ఫంక్షన్స్‌లో పనిచేసే క్రాఫ్టర్లను తొలగిస్తున్నట్లు గేమ్స్‌క్రాఫ్ట్ వివరించింది. తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొంది. మున్ముందు మరిన్ని వ్యవస్థీకృత మార్పులు చేపట్టాల్సి అవసరం ఉందని అభిప్రాయపడింది. తొలగించిన ఉద్యోగులకు ఒప్పందం ప్రకారం చెల్లింపులు చేస్తామని తెలిపింది. అలాగే, వచ్చే ఏడాది మార్చి వరకు వారికి ఆరోగ్యబీమా ప్రయోజనాలను కల్పిస్తామంది. గ్రూప్ ప్లాన్‌ను వ్యక్తిగత బీమా పాలసీగా మార్చుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు పేర్కొంది. రియల్‌మనీ గేమింగ్‌లో ఉన్న మరికొన్ని కంపెనీలూ ఉద్యోగులను తొలగించే ప్రక్రియను ఇప్పటికే చేపట్టాయి.

## నేనంటే గిట్టని వారు దుష్ప్రచారం

- పార్టీ మారడం, రాజీనామా చేయడం అంటూ రూమర్స్
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వివరణ



**నల్లగొండ, సెప్టెంబర్ 18 :** తనటే గిట్టని కొందరు వ్యక్తులు తన ప్రతిష్ఠ దెబ్బతీసేందుకు, సామాజిక మాధ్యమాల ద్వారా అవాస్తవాలు వ్యాపింపజేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వదంతులను నమ్మొద్దని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. గుంటూరులో ఓ కార్యక్రమానికి వెళ్తూ.. చిట్యాల మండలం పెద్దకాపర్తిలో కార్యకర్తలతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ప్రచారంపై స్పందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాజీనామా చేస్తున్నానని, పార్టీ మారుతున్నానని, పార్టీ పెడుతు న్నానని ఇలా రకరకాల వార్తలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ శ్రేయస్సు దృష్ట్యా, పార్టీని బలోపేతం చేసేందుకు కొన్ని సందర్భాల్లో నా అభిప్రాయాన్ని బహిరంగంగా చెప్పాను. అలా చెప్తే తప్పేంటి? ఇవాళ కూడా ఓ ప్రైవేటు కార్యక్రమానికి గుంటూరు వెళ్తుంటే.. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలవడానికి వెళ్తున్నానని వదంతులు సృష్టిస్తున్నారు. నా రాజకీయ భవిష్యత్ గురించి మీడియా సమావేశం పెట్టి చెబుతా, అప్పటి వరకు ఈ దుష్ప్రచారాలు నమ్మొద్దని తెలంగాణ సమాజాన్ని కోరుతున్నానని రాజగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తన పదవికి రాజీనామా చేస్తున్నానని, పార్టీ మారుతున్నానని లేదా కొత్త పార్టీ పెడుతున్నానని జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని ఆయన స్పష్టం చేశారు. మా కుటుంబం ఎప్పటినుంచో కాంగ్రెస్ పార్టీ నేపథ్యమే ఉన్న కుటుంబం. నాకు కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అంటే గౌరవం ఉంది. కానీ నాకు, మా కుటుంబానికి గిట్టని కొందరు వ్యక్తులు కావాలనే ఈ రకాల ప్రచారం చేస్తున్నారు. మా ప్రతిష్ట దిగజార్చేందుకే ఈ రూమర్లు సృష్టిస్తున్నారని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకే తన వ్యాఖ్యలు ఉంటాయని, తన రాజకీయ భవిష్యత్తుపై తాను చెప్పకపోతే ఇతరుల మాటలను ఎవరు నమ్మొద్దని ఆయన హితవు పలికారు.

## సింగరేణి ప్రమాదంలో ఇద్దరు కార్మికులు అస్వస్థత



**జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 18 :** సింగరేణి భూగర్భ గనిలో ప్రమాదం చోటుచేసుకుంది. కేటీకే 5 ఇంక్లైన్ రెండో లెవెల్ వద్ద వెల్డింగ్ చేస్తున్న క్రమంలో నిప్పు అంటుకుని విషవాయువులు వెలువడ్డాయి. ఈ ప్రమాదంలో అన్వేశ్, ప్రదీప్ అనే ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన తోటి కార్మికులు బాధితులను చికిత్స నిమిత్తం సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మొదటి షిఫ్ట్ ముగిసే సమయానికి ఈ దుర్ఘటన జరిగినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న రెస్క్యూ, ఫైర్, సేఫ్టీ సిబ్బంది ముమ్మర సహాయక చర్యలు చేపట్టారు. గని లోపల పంప్ ఆపరేటర్ చిక్కుకున్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

# అసెంబ్లీకి రాని నేతలు అవసరమా?



**తెలుగు రాష్ట్రాల్లో చాలా విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా అధికారాన్ని కోల్పోయిన తర్వాత విమర్శలే లక్ష్యంగా విపక్షంలో ఉన్న పార్టీలు వ్యవహరిస్తున్నాయి. ప్రతిపక్ష హెూదా ఇస్తే తప్ప అసెంబ్లీకి రానని ఏపీలో విపక్ష వైకాపా అధినేత జగన్ మొండి పట్టుతో ఉన్నారు. "విపక్ష హెూదా ఇవ్వండి, అసెంబ్లీకి వస్తాను," అని అంటున్నారు.**

**ఇక తెలంగాణలో విపక్ష హెూదా ఉన్నా కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదు. అధికారంలో ఉంటే తప్ప అసెంబ్లీలో అడుగు పెట్టేది లేదన్న ధోరణిలో ఉన్నారు. ప్రజలు ఎమ్మెల్యేగా ఎన్నుకున్న తర్వాత అసెంబ్లీకి రావాల్సిందే. సమస్యలపై చర్చించాల్సిందే. అలా కాకుండా జీతభత్యాలు మాత్రం ఠంచనుగా ఎత్తుకుంటున్నారు. ప్రజల సొమ్ము తింటున్న ఈ ఇద్దరు నేతలు ఇంత బాధ్యతారహితంగా ఉన్నారు.**

ఇలాంటి సమయాల్లో చట్టప్రకారం ఏం చేయాలన్నది ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఇలాంటి వారిపై కొరడా ఝుళిపించాలి. వారిని ఎమ్మెల్యేలుగా అనర్హులను చేయాలి. మళ్లీ ఎన్నుకోకుండా చూడాలి. అధికారంలో ఉన్నప్పుడు అప్పులు చేసి, విభజిత ఆంధ్రప్రదేశ్‌ను ఈ ఇద్దరూ కలిసి అప్పుల ఊబిలోకి నెట్టారు. ఇప్పుడేమో ఉన్న ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయని గగ్గోలు పెడుతున్నారు. నిజానికి వీరు అప్పులు ఎందుకు చేశారు? దివాళా తీయించారన్నదానికి సమాధానం లేదు. దేశంలో బహుశా ఇంతగా అప్పుల బారిన పడ్డ రాష్ట్రాలు లేవేమో. అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆర్థిక క్రమశిక్షణ పాటించలేదు. దీంతో ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తూ, అనుత్పాదక రంగాలకు విపరీతంగా దుబారా చేశారు. వీటినే అభివృద్ధి, సంక్షేమం అంటూ ఓటు బ్యాంకును పటిష్టం చేసుకునే పనిలో పడ్డారు. ఆర్థిక క్రమశిక్షణతో పాటు, రాజకీయ క్రమశిక్షణ కూడా పాటించకపోతే మట్టి కరచిపోతుందని గతంలో అనేక సందర్భాల్లో చూశాం. ప్రధానంగా అభివృద్ధి పేరుతో చేస్తున్న డబ్బు పందేరాలు రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. ఈ అప్పుల నుంచి బయటపడే మార్గాలు కూడా కనిపించడం లేదు. అలాగే అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. ఇరు తెలుగు రాష్ట్రాల్లో విపక్షాలను దెబ్బతీయడం, విమర్శలను సహించకపోవడం వంటి చర్యలతో ఇద్దరు సీఎంలు నిరంకుశంగా పనిచేయడం ద్వారా తెలుగు రాష్ట్రాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అలాంటి రాష్ట్రాలను గాడిలో పెట్టాల్సిన ప్రస్తుత సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి మరిన్ని అప్పులు చేస్తున్నారే తప్ప, సమస్యలపై ఆలోచించడంలేదు.

ఏపీలో జగన్ ప్రభుత్వం విపక్షాలను అణచివేయడం, కేసులు పెట్టడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ప్రజల్లో తిరస్కారం పెరిగింది. దీంతో అధికారం కోల్పోయి, అసెంబ్లీకి రానని మంకుపట్టుతో ఉన్నారు. పార్టీలను అణచివేయడంలో కేసీఆర్ చేసిన ప్రయత్నం ఇప్పుడు ఆయనకే ఎదురు తిరిగింది. కాంగ్రెస్‌ను నామరూపాలు లేకుండా చేయాలన్న కుట్రతో చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ఫలితంగా కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చింది. దీంతో కేసీఆర్ కూడా అసెంబ్లీకి రాకుండా ముఖం చాటుకున్నారు. కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణలో ఉనికి లేకుండా పోవాలని కేసీఆర్ వేసిన ఎత్తుగడలు ఫలించలేదు. వారి దెబ్బకు బీఆర్ఎస్ ఉనికి కోల్పోయింది. ఇలాంటి రాజకీయ నాయకులు అవసరమా అన్నది ప్రజలు ఆలోచించాలి. నిజాయితీ లేని రాజకీయ నాయకులను పక్కన పెట్టడం నేర్చుకోవాలి. అసెంబ్లీకి రాని నేతలు ప్రజలకు ఏం సేవ చేస్తారో చూస్తున్నాం. అధికారంలో ఉన్నా మేలు చేయలేదు, విపక్షంలో ఉన్నా మేలు చేయలేదు అనే విషయాన్ని కేసీఆర్, జగన్‌లు నిరూపించారు.

బెంగాల్‌లో కమ్యూనిస్టులు ఇదే ధోరణిలో 30 ఏళ్లపాటు రాజ్యమేలారు. తమకు తిరుగు లేదన్న ధోరణిలో వారు ప్రజల ఆశలను, ఆకాంక్షలను పట్టించుకోలేదు. తమ నిరంకుశ పాలనకు ప్రజాస్వామ్యం, అభివృద్ధి ముసుగేసారు. కానీ అక్కడ మమతా బెనర్జీ వంటి వారు పుట్టుకుని వచ్చారు. కమ్యూనిస్టులను కూకటి వేళ్లతో పెకిలించారు. అయితే ఆమె కూడా ఇప్పుడు అదే ధోరణిలో నిరంకుశ పాలన సాగించడంతో ఆమె పునాదులు కూడా కదులుతున్నాయి. బీజేపీ అక్కడ చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు పలుకుతున్నారు. నిరాశా నిస్పృహలతో ఉన్న మమతా బెనర్జీ బీజేపీ నేతలపై దాడులకు దిగుతున్నారు. ప్రజాస్వామ్యంలో నిరంకుశ విధానాలను ఎవరు అవలంబించినా పతనం తప్పదు. అది గుర్తించకపోతే మనుగడ కూడా కష్టం. ప్రజల మనసు తెలుసుకుని ముందుకు సాగితే ఎంతకాలమైనా ప్రజలు ఆదరిస్తారు. తెలంగాణలో కూడా తొలుత తెలుగుదేశం పార్టీని, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీని కోలుకోకుండా దెబ్బతీసిన కేసీఆర్ ఇప్పుడు ప్రతిపక్ష పాత్రకే పరిమితం అయ్యారు. ఇలాంటి దుస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందన్న ఊహ ఆయనకు ఉండకపోవచ్చు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ఏ తప్పు చేశారో, తెలంగాణలో కూడా కేసీఆర్ అదే తప్పు చేశారు.

పశ్చిమ బెంగాల్‌లో బలంగా ఉన్న వామపక్షాలను మమతా బెనర్జీ బలహీనపరిచారు. ఏపీలో కూడా జగన్ టిడిపిని తిట్టడం, కేసులు పెట్టడం, లేపేయడం వంటి చర్యలకు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా ప్రజలు తిరిగి టిడిపిని ఎన్నుకున్నారు. ప్రజలు మెచ్చేలా పాలన అందించినంతవరకు పాలక పార్టీకి భయముండదు. కానీ ఇది విస్మరించి వ్యవహరించడంవల్ల ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జగన్, కేసీఆర్‌లు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. వారు అసెంబ్లీకి వచ్చి తమ హయాంలో చేసిన మేలు గురించి చెప్పాలి. విపక్షంగా ప్రజల పక్షాన పోరాడాలి. సమస్యలపై నిలదీయాలి. కానీ అధికార పక్షం ఎదురుదాడిని తట్టుకోలేక భయంతో అసెంబ్లీకి ముఖం చాటేస్తున్నారు. ఇప్పుడు భారతీయ జనతా పార్టీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోంది. బీజేపీ ఇంతలా బలం పుంజుకోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రజల్లో నిరసనలు నివురుగప్పితే నాయకుడు ఏ పార్టీలో అయినా పుట్టుకుని వస్తారని గమనించడం లేదు. బీఆర్ఎస్ పార్టీలో ప్రజాస్వామ్యం మచ్చుకు కూడా కనిపించకుండా, "అంతా తామే" అన్నట్టుగా కేసీఆర్, కేటీఆర్ వ్యవహారాలు నడిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. అసెంబ్లీకి వెళ్లకపోతే నష్టపోయేది జగన్, కేసీఆర్‌లే అని గుర్తించాలి.

# బతుకమ్మ, దసరాకు టీజీఎస్ఆర్టీసీ 7754 ప్రత్యేక బస్సులు

### ఈ నెల 20 నుంచి అక్టోబరు 2 వరకు నడపాలని నిర్ణయం




**హైదరాబాద్:** బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీజీఎస్ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ఈ నెల 20 నుంచి అక్టోబరు 2 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 7754 ప్రత్యేక సర్వీసులను నడపాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అందులో 377 స్పెషల్ సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. పండక్కి సొంతూళ్లు వెళ్లినవారు తిరుగుపయనమయ్యేందుకు వీలుగా అక్టోబర్ 5, 6 తేదీల్లోనూ రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపేందుకు సిద్ధమవుతోంది. హైదరాబాద్‌లో ప్రధానంగా ఎంజీబీఎస్, జేబీఎస్‌తో పాటు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే కేపీహెచ్‌బీ, ఉప్పల్ క్రాస్‌రోడ్, ఉప్పల్ బస్టాండ్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడపనుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రం నలుమూలలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రకు కూడా ప్రత్యేక సర్వీసులు నడపనుంది. పండగ స్పెషల్ బస్సుల్లో ప్రత్యేక ఛార్జీలు వసూలు చేయనున్నారు.

### గతేడాది కంటే అదనంగా 617 బస్సులు: సజ్జనార్

"బతుకమ్మ, దసరా పండుగల దృష్ట్యా ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి సంస్థ సిద్ధంగా ఉంది. గతేడాది కంటే అదనంగా 617 బస్సులను ఏర్పాటు చేస్తున్నాం. రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంప్‌లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. రద్దీ ప్రాంతాల వద్ద పర్యవేక్షణ అధికారులను నియమిస్తున్నాం. ప్రయాణికుల రద్దీని బట్టి వారు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచుతారు. పోలీస్, రవాణా, మున్సిపల్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ..ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం" అని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. బతుకమ్మ, దసరా ప్రత్యేక సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్ ను సంస్థ అధికారిక వెబ్ సైట్ http://tgsrtcbus.inలో చేసుకోవాలని కోరారు. పూర్తి సమాచారం కోసం టీజీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని సూచించారు.

# తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష

- యూరియా సరఫరాలో నిర్లక్ష్యం
- కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 :** యూరియా విషయంలో స్పష్టత లేని కేంద్రం, రాష్ట్రాల పట్ల నిర్లక్ష్యం వహించిందని మాజీకేంద్రమంత్రి, కాంగ్రెస్ నేత డాక్టర్ ఎస్. వేణుగోపాలాచారి అన్నారు. రాష్ట్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నా కేంద్రం ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రకటన చేయలేదన్నారు. దీనికితోడు రాష్ట్రంలోని బిజెపి ఎంపిలు, మంత్రులు అనవసరంగా నోరు పారేసుకోవడం సరికాదన్నారు. ఇకపోతే కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులపైన, హామీలపైన స్పష్టత ఇవ్వడంలో విఫలమైన కేంద్రంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. యూరియాపై ఎందుకు స్పష్టత ఇవ్వరని అన్నారు. ఇప్పుడు దేశంలో ఆహర కొరతకు, ధాన్యం రేట్లు పెరగడానికి కారణం ఎవరని అన్నారు. తెలంగాణ పండించిన ధాన్యాన్ని బేషరతుగా కొనివుంటే ఇవాళ ఇంతటి సంక్షోభం వచ్చి ఉండేది కాదన్నారు. ఇంతకాలం తాము సంయమనంతో వ్యవహరించామని అన్నారు. తమ ఎంపిలు పార్లమెంటులో పోరాడినా లాభం లేకుండా పోయిందన్నారు. కేంద్రం నీతి ఆయోగ్ ఏర్పాటు చేసినప్పుడు చేసిన ప్రకటనలకు తాజాగా అనుసరిస్తున్న విధానాలకు పొంతన లేకుండా ఉందన్నారు. నిధుల విడుదలలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందన్నారు. బిజెపి ఎంపిలు కూడా తప్పుదోవ పట్టించడం తగదన్నారు. తెలంగాణలో హుంకరిస్తున్న నేతలు ఈ నేలకు ఏంచేశారో చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని వారు గుర్తించాలన్నారు. అనేక విషయాల్లో కేంద్రం తెలంగాణపై చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. ఈ సమస్య తెలంగాణకు సంబంధించిందే కాదని.. దాదాపు చాలా రాష్ట్రాలకు సంబంధించిందన్నారు. ఆర్థిక సంఘం బకాయిలు, గ్రామీణాభివృద్ధి నిధులు తక్షణమే విడుదల చేయాలని కొత్త ప్రభాకర్ రెడ్డి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని సూచించారు.



# నేపాల్‌లో శాంతి స్థాపనకు అండగా ఉంటాం

### సుశీలా కార్కీకి ప్రధాని మోదీ హామీ

**న్యూఢిల్లీ :** సోషల్ మీడియాపై నిషేధం, అవినీతి వ్యతిరేక నిరసనలతో కొన్ని రోజుల క్రితం అట్టుడికిన నేపాల్‌లో పరిస్థితులు కుదుటపడ్డాయి. ఈ క్రమంలో ఆ దేశంలో శాంతి స్థాపనకు భారత్ అండగా ఉంటుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. తాత్కాలిక ప్రభుత్వ ప్రధానిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశీలా కార్కీతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన విషయాలను మోదీ ఎక్స్‌లో పంచుకున్నారు. సుశీలా కార్కీతో అద్భుతమైన సంభాషణ జరిగిందని పేర్కొన్నారు. నిరసనల్లో ప్రాణాలు కోల్పోయినవారికి సంతాపం వ్యక్తం చేసినట్లు తెలిపారు. శాంతి, స్థిరత్వం పునరుద్ధరణకు ఆమె చేసే ప్రయత్నాలకు భారత మద్దతును పునరుద్ఘాటించినట్లు మోదీ వెల్లడించారు. సామాజిక మాధ్యమాల నిషేధంతో మొదలై.. అవినీతికి వ్యతిరేక ఉద్యమంగా మారిన నేపాల్ ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. దీంతో ప్రధాని కేపీ శర్మ సహా పలువురు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే సుశీలా కార్కీని తాత్కాలిక ప్రధానిగా జెన్-జీ ఎంపిక చేసింది. గత శుక్రవారం ఆమె ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు. కార్కీ సిఫార్సు మేరకు దేశ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ పార్లమెంటును రద్దు చేశారు. 2026 మార్చి 5న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు.

# రాగల మూడురోజులు భారీ వర్షాలు

### పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :** తెలంగాణలో రాగల మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీచేసింది. సూర్యాపేట, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడుతాయని.. అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది. శుక్ర, శనివారాల్లో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలుపడుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. దక్షిణ ఇంటీరియర్ కర్నాటక నుంచి తమిళనాడు మీదుగా కొమోరిన్ ప్రాంతం వరకు సగటున సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించిందని ఉందని తెలిపింది. మధ్యప్రదేశ్ మధ్య ప్రాంతాల నుంచి పశ్చిమ-మధ్య ఆనుకొని ఉన్న నైరుతి బంగాళాఖాతం వరకు తూర్పు విదర్భ, తెలంగాణ, దక్షిణ తెలంగాణ, దక్షిణ కోస్తాంధ్ర మీదుగా సగటు-సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి కొనసాగుతుందని వాతావరణశాఖ వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు దంచికొట్టాయి. మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, సంగారెడ్డి, సిద్దిపేట, హైదరాబాద్, పలు పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ముషిరాబాద్ పరిధిలోని భోలక్‌పూర్‌లో 15.5 సెంటీ-మీటర్ల వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.



# హైదరాబాద్‌లో మళ్లీ వర్షం..

### వాహనదారుల అవస్థలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :** నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, ఫిల్మ్‌నగర్, ఎర్రగడ్డ, యూసఫ్‌గూడ, అమీర్‌పేట, బోరబండ, చార్మినార్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణలో మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇవాళ ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, సూర్యాపేట, నాగర్ కర్నూల్ జిల్లాల్లో కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. గంటలకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది.

# అభాగ్యుల కన్నీళ్లు తుడవలేని ప్రభుత్వం

### ఇటీవల ప్రమాదాలపై కేటీఆర్ ఆగ్రహం



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అభాగ్యుల కన్నీళ్లు తుడవలేని అమానవీయ సర్కార్ ఇది అని కేటీఆర్ విమర్శించారు. అది ఎస్ఎల్‌బీసీ సొరంగం అయినా, సిగాచీ పరిశ్రమ అయినా, హైదరాబాద్ వరదలయినా, ప్రతి చోటా అదే నేరపూరిత నిర్లక్ష్యం, అదే చేతగానితనం అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై కేటీఆర్ నిప్పులు చెరిగారు. వరదనీటి నాలాల్లో ముగ్గురు గల్లంతై నాలుగు రోజులు దాటినా కాంగ్రెస్ సర్కార్ చేష్టలుడిగి చూస్తుందని మండిపడ్డారు. ప్రాణాలు ఎలాగూ కాపాడలేరు.. దురదృష్టవశాత్తూ ఎవరైనా మరణిస్తే కనీసం పార్థివదేహాలు అయినా వెలికితీయలేని అసమర్థ ప్రభుత్వం ఇది! అభాగ్యుల కన్నీళ్ళు తుడవలేని అమానవీయ సర్కారు ఇది! అని కేటీఆర్ విమర్శించారు.

# ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీ

### ముగ్గురు దుర్మరణం

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 18 :** ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు మరణించారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలంలోని కొత్తమొల్గర సమీపంలో గురువారం మధ్యాహ్నం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపురం మండలానికి చెందిన ముగ్గురు ప్రయాణికులు ఆటోలో భూత్పూర్ వైపు వెళ్తున్నారు. ఆటో డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ కొత్త మొల్గర సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ఆటోను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో గట్టుకాడిపల్లి గ్రామానికి చెందిన సంపల్లి వంశీ (24), హైదరాబాద్‌కు చెందిన నర్సింహారెడ్డి (57) ఘటనా స్థలంలోనే మృతి చెందారు. దొంతికుంట తాండకు చెందిన పాత్లవత్ సక్రి (34) తీవ్రగాయాలపాలవ్వడంతో జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# దిల్లీ పబ్లిక్ స్కూల్ ఘటన..

### నాచారం సీఐపై బదిలీ వేటు

**హైదరాబాద్:** దిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థిపై దాడి ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై నాచారం సీఐపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. పుట్టిన రోజున.. బర్త్డే బంప్స్ పేరిట తోటి విద్యార్థులు చేసిన వికృత చేష్టలతో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. కొత్తపేటకు చెందిన విద్యార్థి(14) నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆగస్టు 29న పుట్టినరోజు కావడంతో.. తోటి విద్యార్థులు మధ్యాహ్నం విరామ సమయంలో సరదాగా చేసిన చేష్టలతో ఆ విద్యార్థి మర్మంగానికి గాయమై రక్తస్రావమైంది. పిడిగుద్దుల ధాటికి రక్తం కారుతున్నా.. తోటి విద్యార్థులు వదల్లేదు. విషయం తెలిసి ప్రిన్సిపల్ ఆ విద్యార్థిని ఆసుపత్రికి తరలించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు మెరుగైన వైద్యం కోసం బంజారాహిల్స్‌లోని ఆసుపత్రికి తరలించారు. విద్యార్థికి శస్త్ర చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పింది. ఘటనపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినప్పటికీ బాధ్యులైన విద్యార్థులు, పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని నాచారం సీఐని బదిలీ చేస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు.

# గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల

# భవన నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్

- గురుకుల పాఠశాల, కళాశాల నిర్మాణం వద్ద కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశం.
- అత్యవసరమైన గదులను త్వరితగతిన పూర్తి చేయాలి.
- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : కలెక్టర్.



**మేడ్చల్ మల్కాజిగిరి/కలెక్టరేట్, సెప్టెంబర్ 18, (జనం వార్త) :** గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల భవనాలను త్వరితగతిన పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులు ఆదేశించారు. గురువారం మేడ్చల్ మండలంలో నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల కళాశాల భవన నిర్మాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు ఎన్ని రోజుల్లో పూర్తవుతాయని, ఏ ఏ పనులు పెండింగ్లో ఉన్నాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాధాన్యత క్రమంలో అత్యవసరమైన నిర్మాణాలను ముందుగా పూర్తి చేయాలని సూచించారు. తరగతి గదులు, కిచెన్ టాయిలెట్స్ ముందుగా పూర్తి చేసుకుని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. బోడుప్పల్ లో ప్రైవేటు బిల్డింగ్ లో నిర్వహిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ను దసరా సెలవుల లోపు తరలించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో, కళాశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదనంగా భవన నిర్మాణాలు అవసరమైతే నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మార్వో భూపాల్, ఆర్ సి ఓ నాగార్జున, ప్రిన్సిపల్ మమత తదితరులు పాల్గొన్నారు.







## ఎంఆర్ఓకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

**శామీర్ పేట, సెప్టెంబర్ 18, (జనం వార్త) :** శామీర్ పేట్ మండల తహశీల్దార్ యాదగిరిరెడ్డి జన్మదిన పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు వెంకట్ రెడ్డి తహశీల్దార్ ను ఆయన కార్యాలయంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో కు వెంకట్ రెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం శామీర్ పేట్ మండల ప్రజల కోసం పనిచేస్తున్న తహశీల్దార్ యాదగిరిరెడ్డి తన జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.



## లంబాడీలపై కుట్రలు చేస్తే సహించేది లేదు : ఎన్‌బిఎంఐ నాయకులు

**మేడ్చల్ మల్కాజిగిరి(కలెక్టరేట్) సెప్టెంబర్ 18, (జనం వార్త) :** లంబాడీలపై జరుగుతున్న కుట్రలను ఇకపై సహించేది లేదని నేషనల్ బంజారా మిషన్ ఇండియా(ఎన్‌బిఎంఐ) నాయకులు స్పష్టం చేశారు. గిరిజన తెగల మధ్య విభేదాలు సృష్టిస్తూ, లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని కొందరు ప్రయత్నిస్తున్న కుట్రలను నాయకులు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సోయం బాబూ రావు, ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు లు సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌పై ఎన్‌బిఎంఐ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం సికింద్రాబాద్ జేబీఎస్ బస్టాండ్‌లో ఎన్‌బిఎంఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు రాజయ్య నాయక్, ఎన్‌బిఎంఐ తెలంగాణ స్టేట్ లీగల్ అడ్వైజర్ రవి రాజ్ రాథోడ్, మేడ్చల్ మండల అధ్యక్షులు బి.బి.సింగ్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ "లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే ప్రయత్నాలను మేము ఏ విధంగానూ సహించము. గిరిజన తెగల మధ్య చిచ్చు పెట్టే రాజకీయ కుతంత్రాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.



## జ్యోతినగర్ కాలనీ కమాన్‌ను ప్రారంభించిన వజ్రేష్ యాదవ్

**మేడిపల్లి,సెప్టెంబర్ 18 (జనం వార్త) :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 24వ డివిజన్ లో మాజీ కార్పొరేటర్ గుర్రాల రమా వెంకటేష్ యాదవ్ సొంత నిధులతో నిర్మించిన జ్యోతి నగర్ కాలనీ కమాను కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,బి బ్లాక్ అధ్యక్షులు మహేష్ గౌడ్, ఆర్టిఏ మెంబెర్ జైపాల్ రెడ్డి,బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,మాజీ కార్పొరేటర్లు బింగి జంగయ్య యాదవ్, బొమ్మక్ కళ్యాణ్,కుంభం కిరణ్ రెడ్డి,సుమన్ నాయక్,సీసా వెంకటేష్ గౌడ్,నాయకులు జక్కా రాములు,కాంగ్రెస్ నాయకులు,జ్యోతి నగర్ కాలనీ అధ్యక్షులు యాకూబ్,కాలనీ వాసులు పాల్గొన్నారు.




## ఆశ్లేష ప్రైవేట్ ఐటీఐ సర్టిఫికెట్ స్నాతకోత్సవము

**శామీర్‌పేట, సెప్టెంబర్ 18, (జనం వార్త) :** ఆశ్లేష ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో గురువారం రోజు 2023 – 2025 బ్యాచ్ సర్టిఫికేటు స్నాతకోతసవము జరిగింది. దీనికి ముఖ్యతిథిగా బీరం వేంకటరమణ తెలంగాణ మోడల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు హాజరు అయ్యారు. విద్యార్థులు ఈ సమాజంలో అతిచిన్న వయసులో స్థిరపడాలంటే పదవ తరగతి ఉత్తీర్ణులు కాగానే ఐ.టీ.ఐ చదివి మంచి ప్రావీణ్యతగడించి జీవితంలో స్థిరపడవచ్చునని విద్యార్థులకు తెలిపారు. శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంటు విజయలక్ష్మి మాట్లాడుతూ... విద్యార్థులు ఇంతటితో చదువు ఆపకుండా స్కిల్స్ నేర్చుకుని పరిశ్రమలలో ప్రావీణ్యత పొంది జీవితాన్ని విజయవంతం చేసుకోవాలని ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులను అనుసరించుకుంటూ ముందుకు నడవాలని రవికుమార్ తెలిపారు. దీనికి మంచి ప్రావీణ్యతపొంది ఐ టీ ఐ సెక్టార్లో వివిధ పరిశ్రమలలో అప్రెంటిస్షిప్ కొరకు ప్రయత్నించి తప్పకుండా సంవత్సరం వృథాకాకుండా వారి వారి విధానాల ప్రకారంగా చేసుకోవాలని శ్రీ కరుణకుమార్ (కంపెనీ హెచ్.ఆర్) తెలిపారు. చివరిగా ఐ టి ఐ ప్రిన్సిపాల్ దామోదర్ మాట్లాడుతూ... ఐటిఐ తో పాటు బ్రిడ్జి కోర్సు వ్రాసి పాలిటెక్నిక్ లో ద్వితీయ సంవత్సరం అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. ఈ సంవత్సరం వృథా కాకుండా మన శామీర్ పేట, తుర్కపల్లి పారిశ్రామికవాడల్లో ఉద్యోగాలు పొందవచ్చని చెప్పారు. అందరూ విద్యార్థులు సర్టిఫికెట్లు పొందారు.

## స్థానిక సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

**దసరా పండగలోపు తాగునీటి సమస్య పరిష్కరించాలి : ఎమ్మెల్యే మల్లారెడ్డి**



**మేడిపల్లి, సెప్టెంబర్ 18 (జనం వార్త) :** పీర్జాదిగూడ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీర్జాదిగూడ కమిషనర్ త్రిళేశ్వర్ రావును మాజీ మంత్రి,మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లా రెడ్డి, మాజీమేయర్ జక్క వెంకట్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో నెలకొన్న సమస్యలను తెలియజేస్తూ కమిషనర్ త్రిలేశ్వర్ రావుకు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి లు మాట్లాడుతూ రాబోయే దసరా పండుగలు ప్రజలకు తాగునీరు అందించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. అవసరమైన చోట తాగునీటి కోసం నూతన పైపులైన్లు ఏర్పాటు చేసి నీటి సరఫరా చేయాలని కోరినట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతులు ఏర్పాటుకు నిర్లక్ష్యం వహించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ మౌలిక వసతులు ఏర్పాటు కోసం ఇప్పటికే టెండర్లు వేసినట్లు తెలిపారు. దసరా పండగ లోపు తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతురి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, జావీద్ ఖాన్,జిలాని పాషా, కోనేటి వెంకట్, యాసారంశ్రీనివాస్, అమర్ పటేల్, బత్తుల కిరణ్ పలు కాలనీల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో సీఎం, జిల్లా మంత్రి ఫొటోస్ పెట్టి తీరాల్సిందే

**కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్ అలి, మాజి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్**




**సూర్యాపేట :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిత్రపటాలను తప్పనిసరిగా ఉంచాలని సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్ అలి,మాజి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ అన్నారు.గురువారం వారు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పోలగాని బాలు గౌడ్,ఐ ఎన్ టియుసి పట్టణ అధ్యక్షులు రెబల్ శ్రీను తో కలిసి వారు మాట్లాడుతూ క్యాంపు కార్యాలయం అనేది ప్రభుత్వం ఎమ్మెల్యేల కోసం కట్టించిన కార్యాలయం అని అది మాజీ మంత్రి శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి ప్రైవేట్ ఆస్తి కాదని వారు అన్నారు.కాబట్టి క్యాంపు కార్యాలయంలో తప్పనిసరిగా ప్రోటోకాల్ పాటించాలని సీఎం రేవంత్ రెడ్డి మరియు జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిత్రపటాలను తప్పనిసరిగా ఉంచాలని వారు తెలిపారు.సీఎం,మంత్రి చిత్రపటాలు క్యాంప్ కార్యాలయంలో లేవని తమకు ప్రజల నుండి ఫిర్యాదు వచ్చిన సందర్భంగా తాము బుధవారం నాడు ప్రింట్ ఎలక్ట్రాన్ మీడియా విలేకరుల సమక్షంలో క్యాంప్ కార్యాలయానికి వెళ్లి సీఎం మరియు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిత్రపటాలు ఉంచడం జరిగిందని,వాటిని తొలగించినట్లయితే తిరిగి పెట్టడం జరుగుతుందని వారు తెలిపారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే రేషన్ కార్డుల పంపిణీ ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్రమాలలో అక్కడ ఏర్పాటు చేసే ఫ్లెక్సీలలో సీఎం,మంత్రి పాటు ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ఫోటో కూడా ఉంచడం జరుగుతుందని,ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ అయినప్పటికీ తమ ప్రభుత్వం ప్రోటోకాల్ పాటించడం జరుగుతుందని, కాబట్టి ఎమ్మెల్యే కూడా ప్రభుత్వ కార్యాలయం అయినటువంటి క్యాంపు కార్యాలయంలో ప్రోటోకాల్ పాటించాలని వారు తెలిపారు. కొందరు బిఆర్ఎస్ నాయకులు క్యాంపు కార్యాలయాన్ని జగదీష్ రెడ్డి ప్రైవేట్ ఆస్తిగా పేర్కొనడాన్ని వాళ్లు తప్పు పెట్టారు. ప్రైవేటు ఆస్తులు అంటే నాగారంలో, హైదరాబాదులో కట్టుకున్న విల్లాలు,శంషాబాద్ లో , కర్ణాటకలో కొన్న భూములు ఆయన ప్రైవేట్ ఆస్తులని సూర్యాపేటలోని క్యాంపు కార్యాలయం మాత్రం ప్రభుత్వ భవనమని,ఎమ్మెల్యేగా ఎవరు గెలిస్తే వారికి ఆ భవనం కేటాయించడం జరుగుతుందని వారు అన్నారు.క్యాంపు కార్యాలయంలోకి తమ నాయకులు ప్రశాంతంగా వెళ్లి ఫోటోలు పెట్టి,బయటికి వెళ్ళారని, అందుకు మీడియానే సాక్ష్యమని వారు తెలిపారు.కావాలని కొందరు బిఆర్ ఎస్ నాయకులు తాము బెదిరించినట్లు కుర్చీలు కింద పడేసినట్లు పుస్తకాలు పడేసినట్లు ప్రచారం చేస్తున్నారని,ఆ సమయంలో మీడియా అక్కడే ఉందని వారు తెలియజేశారు. ఈ సమావేశంలో నాయకులు రుద్రంగి రవి,నాగుల వాసు,ఆలేటి మాణిక్యం, గడ్డం వెంకన్న,సిరివెళ్ల శభరి,గండూరి రమేష్,కోల నాగరాజు, బొజ్జ సంజయ్,సిద్దిక్,సృజన్ తదితరులు పాల్గొన్నారు.




## పత్తి సేకరణకు సిద్ధం కావాలి

**కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్, సెప్టెంబర్ 18 :** జిల్లాలో పత్తి కొనుగోళ్లు సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పత్తి కొనుగోలు సంబంధిత శాఖలు, ట్రేడర్లు, జిన్నింగ్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 44,885 ఎకరాల్లో పత్తి సాగు జరిగి, 5,38,620 క్వింటాళ్ల దిగుబడి అంచనా వేశామని కలెక్టర్ తెలిపారు. రైతులు ఇబ్బందులు పడకుండా కరీంనగర్, జమ్మికుంట, చొప్పదండి, గోపాలరావు పేట మార్కెట్ కమిటీల పరిధిలోని 15 జిన్నింగ్ మిల్లుల వద్ద ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. రైతుల ఆధార్ తప్పనిసరి కాబట్టి అందరూ తమ బ్యాంక్ ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని, 'కపాస్ కిసాన్ యాప్'లో నమోదు చేయించుకోవాలని అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిన్నింగ్ మిల్లులలో మరమ్మతులు పూర్తి చేయడంతో పాటు ఫైర్ సేఫ్టీ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, మార్కెటింగ్ అధికారి షాబుద్దీన్, వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సీసీఏ, విద్యుత్ శాఖ అధికారులతో పాటు ట్రేడర్లు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో విభిన్న పద్ధతుల్లో విద్యాబోధన

- **జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్, సెప్టెంబర్ 18:** మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త పద్ధతులను అవలంబిస్తూ విద్యాబోధన కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టి,ఎల్,ఎం) మేళాను సందర్శించిన ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విభిన్న ఆలోచనలు కలిగిన ఉపాధ్యాయులు స్వతహాగా వినూత్నంగా మెటీరియల్ తయారు చేయడం హర్షణీయమని అభిప్రాయపడ్డారు. మండల స్థాయిలో ఎంపికైన పది పాఠశాలల ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా రూపొందించిన సుమారు 200కి పైగా టి.ఎల్.ఎం నమూనాలను ఈ మేళాలో ప్రదర్శించారు. వీటిని పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ%ో% తక్కువ ఖర్చుతో ఎక్కువ జ్ఞానాన్ని అందించే విధంగా ఉపాధ్యాయులు రూపొందించిన ఈ మెటీరియల్ ఎంతో ఉపయోగకరంగా ఉంది. విద్యార్థులలో నేర్చుకునే ఆసక్తిని పెంపొందించడంలో ఇవి ప్రధాన భూమిక పోషిస్తాయి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో టి.ఎల్.ఎం ద్వారా బోధిస్తున్న విధానం తల్లిదండ్రులందరికీ తెలియాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా విద్యాధికారి మొండయ్య, విద్యాశాఖ కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, మిల్కురి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# సిబ్బంది నిద్ర.. సముద్రంపై 18 నిమిషాలు విమానం చక్కర్లు

**ఇటలీ :** సిబ్బంది నిద్రపోవడంతో ప్రయాణికుల విమానం ఒకటి 18 నిమిషాలు గాల్లోనే చక్కర్లు కొట్టింది. అప్పుడది సముద్రంపై ప్రయాణిస్తుండటం ఆందోళనకు గురిచేసింది. ఫ్రాన్స్ రాజధాని పారిస్ నుంచి కోర్సికా ద్వీపానికి బయల్దేరిన ఎయిర్ కోర్సికా ఎయిర్‌బస్ విమానానికి ఈ పరిస్థితి ఎదురైంది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పారిస్ నుంచి బయల్దేరిన విమానం.. ఇటలీలోని కోర్సికా రాజధాని అజాక్సియోలోని విమానాశ్రయంలో ల్యాండ్ కావాల్సి ఉంది. దాంతో ఆ దిశగా కిందికి దిగుతోంది. కానీ ఎయిర్‌పోర్ట్ కంట్రోల్ టవర్ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. అప్పుడు నైట్‌షిఫ్ట్‌లో ఉన్న ఎయిట్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది నిద్రపోవడమే అందుకు కారణమైంది. రన్‌వేపై ల్యాండింగ్‌కు అనుమతి రాకపోవడంతో పైలట్ విమానాన్ని గాల్లోనే ఉంచాల్సి వచ్చింది. అప్పుడు ఆ విమానం మధ్యధరా సముద్రం మీదుగా ప్రయాణిస్తోంది. క్లియరెన్స్ లేకపోవడంతో 18 నిమిషాలు అది చక్కర్లు కొట్టాల్సి వచ్చింది. ఈ విషయాన్ని ఏవియేషన్ అధికారులు ధ్రువీకరించారు. అయితే ఆ సమయంలో ఎయిర్‌పోర్ట్ ఫైర్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. వారి ద్వారా ఈ నిద్ర విషయం వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత ఏటీసీ అధికారులు విమానం ల్యాండింగ్‌కు సిగ్నల్ ఇవ్వడంతో సురక్షితంగా కిందకు దిగింది. నిద్రపోయిన అధికారి మద్యం తీసుకోలేదని తేలింది. విమానం గంటపాటు ఆలస్యం కావడం కూడా ఈ పరిస్థితికి దారితీసిందని మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని అధికారులు వెల్లడించారు.



# ఎయిరిండియా ప్రమాదం..

## బోయింగ్‌పై అమెరికాలో దావా

**యూఎస్ :** అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ ఘటనలో మృతులకు సంబంధించిన నాలుగు కుటుంబాలు విమాన తయారీ సంస్థ బోయింగ్‌పై అమెరికాలో దావా వేశాయి. ఈ పిటిషన్‌లో విడిభాగాల తయారీ సంస్థ హనీవెల్ పేరును కూడా చేర్చాయి. ఈ మేరకు ఆ కుటుంబాలు మంగళవారం దాఖలు చేసిన ఈ దావాలో.. ఇంధన స్విచ్‌లు లోపభూయిష్టంగా ఉండటం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించాయి. 787 డ్రీమ్‌లైనర్ విమానం డిజైన్, దాని విడిభాగాల అభివృద్ధి సమయంలోనే లోపాలు వారికి తెలుసని.. అయినా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదని పేర్కొన్నారు. 'ఇంధన సరఫరా, విమాన థ్రస్ట్ నియంత్రణకు సంబంధించిన డిజైన్‌లో లోపం ఉంది' అని బాధిత కుటుంబాలు ఆరోపించాయి. అంతేకాక.. అకస్మాత్తుగా వచ్చిపడే ప్రమాదాలను నిలువరించేందుకు ఆ రెండు సంస్థలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదన్నాయి. స్విచ్‌లకు తనిఖీలు, మరమ్మతులు అవసరమని విమానాయాన సంస్థలను హెచ్చరించలేదన్నారు. వాటిని రీప్లేస్ చేసేందుకు అవసరమయ్యే విడిభాగాలను పంపించడంలో కూడా ఈ రెండు కంపెనీలు విఫలమైనట్లు తెలిపాయి. ఈ పిటిషన్‌పై బోయింగ్, హనీవెల్ సంస్థలు ఇప్పటి వరకు స్పందించలేదు. అహ్మదాబాద్ నుంచి జూన్ 12న లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానం.. టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఘటన సమయంలో విమానంలో 242 మంది ఉండగా.. ఒకేఒక్క వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డారు. ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో తన ప్రాథమిక నివేదికలో పేర్కొంది. అయితే, బోయింగ్ విమానాల్లో ఇంధన నియంత్రణ స్విచ్‌లు సక్రమంగానే ఉన్నాయని యూఎస్ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఎఎ) చెబుతోంది.

# అఫ్గాన్ ఉగ్రస్థావరంగా మారకూడదు: భారత్



**న్యూఢిల్లీ :** లష్కరే తయ్యిబా, జైషే మహమ్మద్ సహా ఐరాస ప్రకటిత ఉగ్రసంస్థలు అఫ్గానిస్థాన్‌లో కార్యకలాపాలు సాగించకుండా చూడాలని ప్రపంచ దేశాలకు భారత్ పిలుపునిచ్చింది. ఆ దేశంలో భద్రతా పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నట్లు ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ వెల్లడించారు. అఫ్గానిస్థాన్‌పై ఐరాస భద్రతామండలిలో జరిగిన సమావేశం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "భారత్–అఫ్గాన్ మధ్య సాంస్కృతిక బంధం ఉంది. ఘర్షణలతో దెబ్బతిన్న దేశంలో శాంతి, స్థిరత్వానికి కృషి చేసే విషయంలో భారత ప్రభుత్వం ఆసక్తిగా ఉంది. అఫ్గాన్‌కు సంబంధించిన కీలక అంశాలపై అంతర్జాయంగా, ప్రాంతీయంగా ఏకాభిప్రాయం, సహకారం ఉండాల్సిన అవసరం ఉందని భావిస్తున్నాం. ఆ దిశగా మా ప్రయత్నాలు అంతర్జాతీయ వేదికలపై ప్రతిబింబిస్తున్నాయి" అని హరీశ్ పేర్కొన్నారు. అలాగే అఫ్గాన్ తాత్కాలిక విదేశాంగ మంత్రితో మన విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ రెండుసార్లు చర్చలు జరిపిన విషయాన్ని గుర్తుచేశారు. ఇదిలా ఉంటే.. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడిని ఆ దేశం తీవ్రంగా ఖండించిన సంగతి తెలిసిందే. అఫ్గాన్‌లో ఇటీవల భారీ భూకంపం సంభవించింది. ప్రకృతి విపత్తులు, పేదరికం, వ్యాధులు, ఆహార కొరత వంటి సమస్యలతో బాధపడుతోన్న అక్కడి ప్రజలకు సాయం అందించాల్సిన సమయం ఆసన్నమైందని హరీశ్ అన్నారు. ఇటీవలి భూకంపం తర్వాత తక్షణమే స్పందించిన దేశాల్లో భారత్ కూడా ఉంది. ఆహారంతో ఔషధాలు, దుప్పట్లు, జనరేటర్లు, టెంట్లు వంటివాటిని పంపించింది. రానున్న రోజుల్లో ఆ దేశానికి మన నుంచి మరింత సాయం అందనుందని హరీశ్ చెప్పారు.

### బీఎల్ఏను ఉగ్రసంస్థగా ప్రకటించండి: చైనా, పాక్ ప్రతిపాదన

తమ సైన్యంపై దాడులు చేస్తున్న బలోచ్ లిబరేషన్ ఆర్మీ దాని అనుబంధ మజీద్ బ్రిగేడ్‌లపై పాకిస్థాన్ చర్యలను తీవ్రం చేసింది. ఆ రెండింటిని ఉగ్రసంస్థలుగా ప్రకటించాలని ప్రతిపాదించింది. దీనికి చైనా కూడా వంతపాడటం గమనార్హం. పాక్ రాయబారి అసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ మాట్లాడుతూ.. ఐఎస్ఐఎల్–కె, అల్‌ఖైదా, తెహ్రిక్–ఇ–తాలిబన్ పాకిస్థాన్, బలోచ్ దాని అనుబంధ మజీద్ బ్రిగేడ్ వంటి ఉగ్రవాద సంస్థలు అఫ్గాన్ కేంద్రంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

# సాఫ్ట్‌వేర్‌తో 'ఓటు' తొలగింపు సాధ్యమా..?

## నిబంధనలు ఏం చెబుతున్నాయి?



**న్యూఢిల్లీ :** సాఫ్ట్‌వేర్ సాయంతో అనేక మంది కాంగ్రెస్ మద్దతుదారుల ఓట్లను తొలగించారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించిన విషయం తెలిసిందే. కర్ణాటకలో కేవలం ఒక్క అలంద్ నియోజకవర్గంలోనే వేలాది ఓట్లను తొలగిం చారని ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను తోసిపుచ్చిన ఈసీ.. ఆన్‌లైన్‌లో ఏ ఒక్క ఓటును తొలగించలేరని స్పష్టం చేసింది. సంబంధిత వ్యక్తికి సమాచారం లేకుండా ఓటు తీసివేయడం కుదరదని పేర్కొంది. ఈ నేపథ్యంలో అసలు ఓటు తొలగింపు ప్రక్రియ ఎలా ఉంటుందని విషయం పరిశీలి స్తే.. ఓటరు జాబితా నుంచి పేరు తొలగించాలన్నా లేదా జాబితాలో ఎవరిపైనా అభ్యంతరం ఉన్నా.. ఫారం 7తో ఎలక్టో రల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఎవరైనా ఓటరు తన నియోజకవర్గం మారినా ఇదే ఫారంతో దరఖాస్తు చేసుకోవాలి. నియోజకవర్గం పేరు, ఎపిక్ నంబరు, తొలగింపునకు కారణాన్ని తెలియజేయడంతోపాటు దరఖాస్తుదారుని వివరాలు, సంతకం కూడా అవసరం. ఆన్‌లైన్‌లో లేదా బూత్ లెవల్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

### క్షేత్రస్థాయిలో పరిశీలన..

ఇలా వచ్చిన దరఖాస్తులను ఈఆర్ఓ క్షుణ్నంగా పరిశీలించి.. ఓటరుకు వ్యక్తిగతంగా, రిజిస్టరు పోస్టు ద్వారా తెలియజేస్తారు. ఒక్కోసారి ఓటరు ఇంటికి నోటీసులు అంటిస్తారు. ఓటరు ఆ అడ్రస్‌లోనే ఉన్నాడా? లేదా మరణించాడా? నకిలీ నమోదా? అన్న విషయాన్ని బీఎల్ఓ క్షేత్రస్థాయికి వెళ్లి ధ్రువీకరించుకొని ఈఆర్ఓకు నివేదిస్తారు. తొలగింపు కోసం ఇతరులు దరఖాస్తు చేస్తే.. వారితోపాటు ఓటరు అభిప్రాయాన్నీ తీసుకుంటారు. సంబంధిత దస్త్రాలు, వ్యక్తిగతంగా హాజరుకావడం, స్టేట్‌మెంట్ రికార్డు వంటి ప్రక్రియ తర్వాత పేరును తొలగింపు లేదా దరఖాస్తు తిరస్కరణపై నిర్ణయం తీసుకుంటారు. దీనిపై దరఖాస్తుదారు అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గం మారినప్పుడు, సంబంధిత అడ్రస్‌లో నివసించనప్పుడు, జాబితాలో రెండుసార్లు ఉన్నప్పుడు, వ్యక్తి చనిపోవడం లేదా భారత పౌరుడు కాని పక్షంలో మాత్రమే ఓటరును తొలగించే అవకాశం ఉంటుంది.

### ఎవరైనా దరఖాస్తు చేయవచ్చా?

తమ నియోజకవర్గంలో ఉన్న ఓటరు పేరు తొలగించాలని ఎవరైనా దరఖాస్తు (ఫారం 7) చేయవచ్చు. అయితే, దరఖాస్తు చేసినంత మాత్రానా ఓటు తొలగిపోదు. ఓటరుకు నోటీసు ఇవ్వడం, క్షేత్రస్థాయి దర్యాప్తు తర్వాతే ఈఆర్ఓ నిర్ణయం తీసుకుంటారు. ఓటరు పేరును నేరుగా తొలగించడం చట్టవిరుద్ధం. తప్పుడు దరఖాస్తు చేసినా చట్టప్రకారం నేరమే.

### సాఫ్ట్‌వేర్‌తో తొలగించవచ్చా..?

ఓటరు జాబితాలో పేర్ల తొలగింపు కోసం ఫేక్ మొబైల్ నంబర్లు, ఓటీపీల ద్వారా దరఖాస్తు చేసినట్లు రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. అయితే, ఆన్‌లైన్‌లో కేవలం దరఖాస్తుకు మాత్రమే అవకాశం ఉంది. నేరుగా పేర్లను తొలగించడం కుదరదు. ప్రతి దరఖాస్తులో అంశాలు ధ్రువీకరించుకున్న తర్వాతే చర్య ఉంటుంది. భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చినా అన్నింటికీ ఇదే ప్రక్రియ కొనసాగించాల్సి ఉంటుంది. సాఫ్ట్‌వేర్ ద్వారా తొలగించడం కుదరదని ఎన్నికల సంఘం కూడా స్పష్టం చేసింది.

# విపక్షాలకు అవకాశమిస్తే.. చొరబాటుదారులతో బిహార్ నిండిపోతుంది



**న్యూఢిల్లీ :** ఓట్ల చోరీ అంటూ 'ఇండియా' కూటమి తప్పుడు ఆరోపణలు చేస్తోందని కేంద్ర మంత్రి అమిత్ షా విమర్శించారు. భాజపా అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను తొలగిస్తుందని గతంలో ఇదే తరహా దుష్ప్రచారం చేసిందన్నారు. బిహార్‌లోని డెహరీ ఆన్ సోన్‌లో పార్టీ శ్రేణులతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ మేరకు మాట్లాడారు. బంగ్లాదేశీ చొరబాటుదారులను రక్షించడమే లక్ష్యంగా రాష్ట్రంలో ఇటీవల రాహుల్ గాంధీ యాత్ర నిర్వహించారని ఆరోపించారు. ఒకవేళ ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే.. రాష్ట్రమంతా చొరబాటుదారులతో నిండిపోతుందని వ్యాఖ్యానించారు. "బంగ్లాదేశ్ నుంచి వచ్చిన చొరబాటుదారులను రక్షించడమే రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర' ప్రధాన ఉద్దేశం. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ తిరుగుతూ.. 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే బిహార్ చొరబాటుదారులతో నిండిపోతుందని చెప్పండి. అదేవిధంగా 'ఓట్ల చోరీ' అంటూ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టండి. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను రద్దు చేయడానికి భాజపా యత్నిస్తుందని గతంలో ఇదే తరహా ఆరోపణలు చేశారు. కానీ.. అలాంటిదేమీ జరగలేదు కదా" అని కాషాయ శ్రేణులను ఉద్దేశించి అమిత్ షా పేర్కొన్నారు. బిహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు అమిత్ షా ఈ పర్యటన చేపట్టారు. మగధ–శాహాబాద్ ప్రాంతంలోని 10 జిల్లాల నేతలతో సమావేశమయ్యారు. 2020 అసెంబ్లీ ఎన్నికలు, గత ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ ఎన్డీయే పనితీరు అంతంతమాత్రంగానే ఉండటంతో ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. అంతకుముందు సీఎం నీతీశ్ కుమార్ పాట్నాలో అమిత్ షాను కలిశారు. తాను ఎన్డీయేలోనే ఉంటానని ఇటీవల ప్రధాని మోదీ సమక్షంలో నీతీశ్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

# శబరిమల విగ్రహాలపై బంగారం ఏమైంది..?

## దర్యాప్తునకు కోర్టు ఆదేశం



**కోచి:** కేరళలోని ప్రసిద్ధ శబరిమల ఆలయంలో విగ్రహాల బంగారు పూతపూసిన తాపడాలను అనుమతి లేకుండా తొలగించడం ఇటీవల వివాదాస్పదమైంది. తాజాగా ఇందుకు సంబంధించిన మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విగ్రహాల తాపడాలపై బంగారం బరువు తగ్గడాన్ని కేరళ హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. దీనిపై విజిలెన్స్ కమిటీ దర్యాప్తు చేపట్టాలని న్యాయస్థానం ఆదేశించింది. అసలేం జరిగిందంటే.. శబరిమలలో గర్భగుడి ముందు ఉన్న ద్వారపాలక విగ్రహాలపై బంగారు పూతపూసిన రాగి తాపడాలను 2019లో మరమ్మతుల నిమిత్తం తొలగించారు. వాటిని సరి చేయించి కొత్త బంగారు పూత తాపడాలను అందిస్తానని ఉన్నికృష్ణన్ అనే దాత తీసుకెళ్లారు. ఈ పనిని చెన్నై (%జష్టవఅఖుఱ%)లోని ఓ సంస్థకు అప్పగించారు. 2019లో వాటిని తొలగించే సమయంలో తాపడాల బరువు 42.8 కిలోలుగా ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. అయితే, ఆ తాపడాలను తమ వద్దకు తెచ్చినప్పుడు బరువు 38.28 కిలోలు మాత్రమే ఉందని సదరు కంపెనీ తెలిపింది. అంతేగాక, ఆలయం నుంచి తాపడాలను తొలగించిన దాదాపు 40 రోజుల తర్వాత వాటిని చెన్నైలోని కంపెనీకి అందించినట్లు తెలిసింది. ఈ పరిణామాలపై తాజాగా కోర్టు అనుమానం వ్యక్తం చేసింది. ఉన్నట్టుండి తాపడాల బరువు 4.524 కేజీలు తగ్గడాన్ని తీవ్రంగా పరిగణించింది. వీటిని తిరిగి అమర్చినప్పుడు ఎందుకు బరువును సరిచూడలేదని ప్రశ్నించింది. ఈ తగ్గుదలకు ఏకైక కారణంగా బంగారు పూత తగ్గడమే అని న్యాయస్థానం అభిప్రాయపడింది. లేదంటే దాత వాటి స్థానంలో మరో తాపడాల సెట్‌ను కంపెనీకి ఇచ్చే అవకాశం కూడా ఉన్నట్లు పేర్కొంది. ఇందులో అనేక లోపాలు కనిపిస్తున్నాయని, బరువు ఎలా తగ్గిందో తెలుసుకునేందుకు విజిలెన్స్ కమిటీ దర్యాప్తునకు ఆదేశించింది. ఇందుకు సహకరించాలని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డుకు సూచించింది. దీనిపై మూడు వారాల్లోగా పూర్తి నివేదికను అందజేయాలని స్పష్టం చేసింది. అనంతరం ఈ కేసు విచారణను సెప్టెంబరు 30వ తేదీకి వాయిదా వేసింది. శబరిమల స్పెషల్ కమిషనర్‌కు సమాచారం ఇవ్వకుండానే ద్వారపాలక విగ్రహాల బంగారు తాపడాలను మరమ్మతుల నిమిత్తం తొలగించడంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇటీవల దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ముందస్తు అనుమతులు లేకుండా వాటిని ఎలా తరలిస్తారని ప్రశ్నించింది. దీనిపై బోర్డు నుంచి వివరణ కోరింది.

# సాఫ్ట్‌వేర్‌ను వాడి.. ఓటర్ ఐడీలను తొలగిస్తున్నారు

## రాహుల్ గాంధీ ఆరోపణలు



**న్యూఢిల్లీ :** కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న ప్రాంతాల నుంచి ఓట్లను తొలగించారని విమర్శించారు. రాష్ట్రం వెలుపలి నుంచి నకిలీ లాగిన్లు, ఫోన్ నంబర్లను ఉపయోగించి ఓటర్ ఐడీలను తొలగించినట్లు వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి కేంద్రీకృత పద్ధతిలో ఈ చర్యలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఈ మేరకు దిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. "ఈ ఓట్ల తొలగింపు అంతా వ్యక్తులతో గాకుండా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి చేస్తున్నారు. అదంతా ఒక ప్రక్రియ ప్రకారం జరుగుతోంది. ప్రతిపక్షాలకు ఓట్లు వేసే కమ్యూనిటీలను మరీ ముఖ్యంగా లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనికి సంబంధించి మేం 100 శాతం ఆధారాలను గుర్తించాం. నేను ఈ దేశాన్ని, రాజ్యాంగాన్ని ప్రేమిస్తున్నాను. ఈ ప్రజాస్వామ్య ప్రక్రియను ఇష్టపడతాను. ఈ ప్రక్రియను నేను రక్షిస్తున్నాను. ఇక దీనికి ఎలా స్పందించాలనేది మీ చేతుల్లోనే ఉంటుంది. కర్ణాటకలోని అలంద్‌లో ఆరువేల ఓట్లను తొలగించే ప్రయత్నం జరిగింది" అని విమర్శించారు. అలాగే ఓట్ల చోరీకి పాల్పడేవారిని ఎన్నికల సంఘం చీఫ్ రక్షిస్తున్నారని, ఈ వ్యవహారంపై విచారణ జరపాలంటూ చేస్తున్న అభ్యర్థనలను విస్మరిస్తున్నారని అన్నారు. ఇది హైడ్రోజన్ బాంబ్ కాదని, దానిని త్వరలో పేలుస్తానని వెల్లడించారు. ఈ విమర్శలను ఎన్నికల సంఘం, భారతీయజనతా పార్టీ ఖండించింది. బాంబ్ తుస్సు అందని భాజపా ఎద్దేవా చేసింది.




# ఆన్‌లైన్‌లో ఓట్లు తొలగించలేరు

## రాహుల్ ఆరోపణలను ఖండించిన ఈసీ

**న్యూఢిల్లీ :** సాఫ్ట్‌వేర్ వాడి ఓట్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన విమర్శలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. అదంతా నిరాధార, అసత్య ప్రచారమని వెల్లడించింది. ఆన్‌లైన్ వేదికగా ఓట్లను తొలగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. "సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వకుండా ఏ ఒక్కరి ఓటు తొలగించడం లేదు.. ఆన్‌లైన్‌లో మరెవరూ తొలగించలేరు. 2023లో అలంద్ అసెంబ్లీ నియోజవర్గంలో ఓటర్ల తొలగింపునకు విఫల ప్రయత్నాలు జరిగాయి. ఆ వ్యవహారంపై దర్యాప్తు కోసం ఎన్నికల సంఘమే ఫిర్యాదు చేసింది. రికార్డుల ప్రకారం.. అలంద్ అసెంబ్లీకి 2018లో జరిగిన ఎన్నికల్లో భాజపా అభ్యర్థి విజయం సాధించారు. 2023లో కాంగ్రెస్ నేత బీఆర్ పాటిల్ గెలుపొందారు" అని ఈసీ వెల్లడించింది.


### భాజపా విమర్శలు..

రాహుల్ తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని భాజపా (%దీజీ%) దుయ్యబట్టింది. "రాహుల్‌కు రాజ్యాంగం, చట్టం అర్థం కావడం లేదు. 2014 నుంచి మోదీజీ సాధిస్తున్న విజయాలన్నీ నిజం కాదని ఆయన ఆరోపిస్తున్నారు. ఈ వ్యాఖ్యలు దేశ ప్రజలకు, ఓటర్లకు అవమానం. ఆయన బాంబు గురించి మాట్లాడుతున్నారు. ఈ ప్రకటనలను తీవ్రంగా ఖండిస్తున్నాను" అని మాజీ కేంద్రమంత్రి రవిశంకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. "హైడ్రోజన్ బాంబు పేలుస్తామని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు. ఆ బాంబ్ ఇలాగే ఉంటుందా..? వాళ్లు ఓటమిని చవిచూస్తున్నారు. ఈ సమయంలో వారు చేయాల్సింది దానిని అంగీకరించడం. కష్టపడి మీ స్థాయికి వస్తామనేలా వారి మాటలు ఉండాలి. అంతేకానీ దానికి బదులుగా వారు కోర్టుల జోక్యాన్ని కోరుకుంటున్నారు. లేకపోతే వేరొకరిపై నిందలు వేస్తున్నారు" అని దిల్లీ మంత్రి మజీందర్ సింగ్ సిర్సా మండిపడ్డారు. బంగ్లాదేశ్, నేపాల్ తరహా అశాంతి భారత్‌లో సృష్టించాని రాహుల్ భావిస్తున్నారని కమలం పార్టీ నేత అనురాగ్ ఠాకూర్ విమర్శించారు. రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దాదాపు 90 ఎన్నికల్లో ఓటమి చవిచూసిందని, దాంతో ఆయన అసహనం రోజురోజుకూ పెరుగుతోందని ఎద్దేవా చేశారు. క్షమాపణలు కోరడం, కోర్టు మందలింపులు ఆయనకు పరిపాటిగా మారిపోయాయని అన్నారు.

# క్యాపిటల్ భవనం ఎదురుగా ట్రంప్ బంగారు విగ్రహం..



**యూఎస్ :** అమెరికా ఫెడరల్ రిజర్వు 25 బేసిస్ పాయింట్లు మేర వడ్డీ రేట్ల కోత విధిస్తూ కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బంగారు విగ్రహాన్ని అమెరికా క్యాపిటల్ భవనం ఎదురుగా ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. 12 అడుగులు ఉన్న ఈ విగ్రహం.. ట్రంప్ బిట్‌కాయిన్‌ను పట్టుకుని ఉన్నట్లు రూపొందించారు. క్రిప్టోకరెన్సీ పెట్టుబడిదారులు ఈ విగ్రహం ఏర్పాటుకు నిధులు సమకూర్చినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. డిజిటల్ కరెన్సీ భవిష్యత్తు, ద్రవ్య విధానం, ఆర్థిక మార్కెట్‌లో ఫెడరల్ ప్రభుత్వ విధానాల గురించి చర్చించుకునేలా చేసేందుకే దీన్ని ఏర్పాటు చేశామని నిర్వాహకులు చెప్పినట్లు సమాచారం. ఈ విగ్రహానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. కొంతమంది దీనిపై సానుకూలంగా స్పందించగా.. మరికొందరు విమర్శలు చేస్తున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వు 25 బేసిస్ పాయింట్లు మేర వడ్డీ కోత విధించిన సంగతి తెలిసిందే. ఏడాది తర్వాత ఈ రేట్లను తగ్గించడం ఇదే తొలిసారి. ద్రవ్యోల్బణం పెరుగుతున్నప్పటికీ మందగిస్తున్న కార్మిక మార్కెట్‌కు ఊతం ఇవ్వడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాదిలో మరో రెండుసార్లు వడ్డీరేట్ల కోత ఉండవచ్చని ఫెడ్ అధికారులు సూచనప్రాయంగా తెలిపారు.



## 'ఆల్కహాల్'లో రుహాని శర్మ

ఒకప్పుడు కామెడీ హీరోగా గుర్తింపు తెచ్చుకున్న అల్లరి నరేష్.. ఇప్పుడు రూటు మార్చి డిఫరెంట్ కథలతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఇందులో భాగంగానే మోహర్ తేజ్ దర్శకత్వంలో డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఓ మూవీ ప్రకటించిన విషయం తెలిసిందే. అల్లరి నరేష్ కెరీర్‌లో 63వ చిత్రంగా తెరకెక్కుతోన్న ఈ మూవీకి 'ఆల్కహాల్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయగా.. ఇందులో సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ నిహారికి ఎన్‌ఎమ్ హీరోయిన్‌గా నటిస్తుంది. ఇప్పుడు ఈ సినిమాలో రుహాని శర్మ కూడా భాగం కాగా.. ఆమె బర్త్‌డే సందర్భంగా సినిమా నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు చిత్ర బృందం. 'ప్రతి ఫ్రేమ్‌కి సరైన హై ఉంటుంది' అనే క్యాప్షన్ ఇచ్చి షేర్ చేసిన రుహాని ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీగా నిర్మిస్తున్నారు. ఇందులో అల్లరి నరేష్ ఫుల్ డ్రింకర్‌గా కనిపించనున్నట్లు తెలుస్తుంది.

# కల్కి2 నుంచి తప్పుకున్న దీపిక

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం కల్కి 2898 ఏడీ పార్ట్2 నుంచి దీపక తప్పుకున్నారు. గతేడాది విడుదలైన ఈ చిత్రం భారతీయ సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చి ఎన్నో అవార్డులను సొంతం చేసుకుంది. దీనికి సీక్వెల్ ఉన్నట్లు ఇప్పటికే చిత్రబృందం వెల్లడించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ మూవీ టీమ్ సడెన్ షాక్ ఇచ్చింది. దీని సీక్వెల్‌లో దీపికా పదుకొణె నటించడం లేదని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టింది. కల్కి సీక్వెల్‌లో దీపిక భాగం కాదని అధికారికంగా తెలియజేస్తున్నాం. తొలి భాగం కోసం ఆమెతో సుదీర్ఘ ప్రయాణం చేసినప్పటికీ రెండో పార్ట్‌లో భాగస్వామి కాలేకపోయింది. గొప్ప టీమ్‌తో కల్కి సీక్వెల్ మీ ముందుకు వస్తుంది. భవిష్యత్తులో దీపిక మంచి సినిమాలతో అలరించాలని కోరుకుంటున్నాం అని వైజయంతీ మూవీస్ పోస్ట్ పెట్టింది. నిర్మాణ సంస్థ ప్రకటనతో అభిమానులు షాక్ అవుతున్నారు. గత కొన్ని రోజులుగా దీపికా పేరు నిత్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్న విషయం తెలిసిందే. ఇటీవల ఆమె ఓ భారీ ప్రాజెక్ట్ నుంచి వైదొలగినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఈ భారీ అప్‌కమింగ్ సినిమా నుంచి ఆమె వైదొలగడం చర్చనీయాంశంగా మారింది.





## కిస్ మూవీ ట్రైలర్ విడుదల

తమిళ నటుడు కవిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం కిస్. దాదా సినిమాతో మంచి హిట్ అందుకున్న కవిన్.. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రంలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ప్రముఖ కొరియోగ్రాఫర్ సతీష్ కృష్ణన్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతుండగా.. రోమియో పిక్చర్స్ బ్యానర్‌పై రాహుల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా, సినిమా నుంచి తాజాగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులో కవిన్.. ప్రేమ, ముద్దు అంటే అస్సలు ఇష్టపడని యువకుడి పాత్రలో కనిపిస్తున్నారు. గతంలో జరిగిన సంఘటనల కారణంగా ప్రేమపై నెగిటివ్ భావాలు ఏర్పడిన అతడి జీవితంలోకి ప్రీతి అనే అమ్మాయి ప్రవేశించిన తర్వాత ఎలాంటి మార్పులు జరిగాయి అన్నదే ఈ సినిమా ప్రధాన కథాంశం. ఈ చిత్రం తెలుగు, తమిళంతో పాటు హిందీ భాషల్లో కూడా విడుదల కానుంది.



## సెప్టెంబర్ సినిమాలకు కలిసొచ్చింది

### కిష్కింధపురి సక్సెస్ మీట్‌లో అనిల్ రావిపూడి

ఈ సెప్టెంబర్‌లో థియేటర్‌లు కళకళలాడుతున్నాయని అనిల్ రావిపూడి పేర్కొన్నారు. ఇది సక్సెస్‌ఫుల్ సెప్టెంబర్ అన్నారు. వరుస సినిమాలతో పండగ వాతావరణం నెలకొందని.. ఇదే కొనసాగాలని కోరుకుంటున్నానని అన్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం కిష్కింధపురి ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. తాజాగా ఆడియన్స్‌కు ధన్యవాదాలు చెబుతూ టీమ్ హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ ఈవెంట్‌కు దర్శకుడు అనిల్ రావిపూడి, బాబీ, అనుదీప్, వశిష్ఠలతో పాటు హీరో సాయి దుర్గా తేజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హారర్ సినిమాలు ఎలా ఉన్నా అందరూ ఆదరణ సొంతం చేసుకుంటాయని అందరూ అనుకుంటారు. కానీ, వాటిలో కంటెంట్ ఉంటేనే ప్రేక్షకులు ఆదరిస్తారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వాళ్ల నాన్న ఎంత పెద్ద నిర్మాతో అందరికీ తెలిసిందే. అయినా సాయి మాత్రం ఏ సినీ నేపథ్యం లేనట్లు కష్టపడుతుంటాడు. అనిల్ రావిపూడి చిరంజీవి కాంబినేషన్‌లో రానున్న సినిమాలో కొన్ని సన్నివేశాలు చూశాను. చాలా బాగున్నాయి. కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుంది. ఈ సినిమాతో విజయాన్ని సొంతం చేసుకున్న నిర్మాత సాహు గారపాటి.. సంక్రాంతికి చిరంజీవి చిత్రంతో మరోసారి మంచి ఫలితాలు చూస్తారని బాబీ నమ్మకంగా చెప్పారు.తెలుగు సినిమాలకు థియేటర్‌లలో జనాలు రావడం లేదని ఈ మధ్య కామెంట్స్ వినిపించాయి. సాయి దుర్గాతేజ్ అంటే నాకు చాలా ఇష్టం. ఒక బ్రదర్‌గా ఆయన ఎప్పుడూ నాకు తోడున్నారని సాయి శ్రీనివాస్ తెలిపారు.

## కుటుంబ గొడవలతో మౌనంగా ఉన్నా


### దక్ష ప్రమోషన్‌లో వెల్లడించిన మంచు లక్ష్మి

ఇంట్లో ఎవరు హిట్ అందుకున్నా.. అది అందరి విజయంగా భావించి ఆనందిస్తానని నటి మంచు లక్ష్మి అన్నారు. తన తండ్రి మోహన్‌బాబుతో కలిసి ఆమె నటించిన యాక్షన్ చిత్రం దక్ష 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రచారంలో ఆమె బిజీగా ఉన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తమ కుటుంబంలో జరిగిన గొడవలపై మాట్లాడారు. మిరాయ్ విజయాన్ని నేను కూడా ఎంజాయ్ చేస్తున్నాను. కుటుంబంలో ఎవరికి సక్సెస్ వచ్చినా మా అందరిదిగా భావించి ఆనందిస్తా. ఒకరి కష్టం వృథా కావాలని ఎప్పుడూ కోరుకోను. జీవిత పాఠాలు నేర్చుకోవాలి అనుకుంటాను.. కానీ, కష్టానికి ప్రతిఫలం రాకుండా ఉండాలని ఎప్పుడూ కోరుకోను. ఎందుకంటే ఈ రంగంలో ఎన్ని ఇబ్బందులు ఉంటాయో నాకు తెలుసు. ఒక ఆర్టిస్ట్‌గా వాళ్లకు సలహాలు ఇస్తాను. మిరాయ్ సక్సెస్‌ను ఎంజాయ్ చేయమని మొన్న కలిసినప్పుడు కూడా మనోజ్‌కు చెప్పానని అన్నారు. ఒక కుటుంబంలో ఏదైనా సమస్య వచ్చినప్పుడు అందరూ నలిగిపోతారు. అలా జరగదు అని చెప్పడం అబద్ధం. కానీ, మేము ఉండేది అద్దాల మేడలో.. ఏం చెప్పినా తల, తోక కట్ చేసి వాళ్లకు నచ్చినట్లు రాసుకునే రోజులివి. అలాంటప్పుడు సైలెంట్‌గా ఉండడమే ఉత్తమం అని నాకు అనిపించింది. అందుకే మౌనంగా ఉన్నాను. గతంలో ఏది ఒప్పు, ఏది తప్పు అని ఆలోచించేదాన్ని. ఇప్పుడు అలా ఆలోచించడం లేదు. దీని వల్ల నేను ఆనందంగా ఉంటానా, బాధపడతానా అని ఆలోచిస్తున్నాను. జీవితంలో ఏదైనా మనకు ఒక పాఠం నేర్పడానికే వస్తుంది. ఏది జరిగినా మౌనంగా ఆలోచిస్తే ప్రశాంతత లభిస్తుందని మంచు లక్ష్మి చెప్పారు.



## ఓజి నుంచి ప్రకాశ్ రాజ్ పోస్టర్ విడుదల

పవన్ కల్యాణ్ హీరోగా ఓజీ సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా మేకర్స్ ఓ సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఇందులో విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ పాత్రను పరిచయం చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. చిత్రంలో ఆయన సత్య దాదా అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో ప్రకాశ్ రాజ్ సీరియస్ లుక్‌లో కనిపించారు. పోస్టర్ ఆధారంగా ఆయన పాత్ర కీలకమని అర్థమవుతోంది. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఓజీ రూపొందుతోంది. ఇందులో పవన్ ఇప్పటి వరకూ ఎన్నడూ చూడని పాత్రలో ఓజాస్ గంభీర అనే గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. ఆయన సరసన ప్రియాంకా మోహన్ నటించారు. ఇమ్రాన్ హష్మీ విలన్. శ్రియారెడ్డి, అర్జున్‌దాస్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుతం దీని పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.




## ఏఎన్నార్ 101 జయంతి స్పెషల్

### డాక్టర్ చక్రవర్తి, ప్రేమాభిషేకం రీరిలీజ్

#### థియేటర్లలో ఉచితంగా ప్రదర్శన

దివంగత అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతి సందర్భంగా అభిమానులకు ప్రత్యేక బహుమతి సిద్ధమైంది. ఆయన నటించిన సూపర్‌హిట్ క్లాసిక్ చిత్రాలు డాక్టర్ చక్రవర్తి, ప్రేమాభిషేకం మళ్లీ పెద్ద తెరపైకి వస్తున్నాయి. ముఖ్యంగా, ఈ సినిమాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఎంపిక చేసిన థియేటర్లలో అది కూడా ఉచిత టిక్కెట్లతో ప్రదర్శించనున్నారు. ఇది నిజంగా అభిమానుల్లో విశేష ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ రెండు ప్రసిద్ధ చిత్రాలు సెప్టెంబర్ 20 నుంచి మళ్లీ రీరిలీజ్ అవుతున్నాయి. పెద్ద తెరపై ఏఎన్ఆర్ మాయాజాలాన్ని మళ్లీ ఆస్వాదించే అరుదైన అవకాశం ఇది. ఈ ప్రత్యేక ప్రదర్శనలకు టిక్కెట్లు బుక్ మై షో లో ఉచిత రిజర్వేషన్ కోసం అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ఒంగోలు వంటి ప్రధాన నగరాల్లోని ప్రముఖ థియేటర్లలో ప్రదర్శనలు జరగనున్నాయి. వీటిలో వైజాగ్‌లో క్రాంతి థియేటర్, ఒంగోలులో స్వర్ణ ప్యాలెస్, విజయవాడలో కృష్ణ టాకీస్, అలాగే హైదరాబాద్‌లోని ఒక ప్రసిద్ధ థియేటర్ కూడా ఉన్నాయి. రాబోయే రోజుల్లో మరిన్ని కేంద్రాలను జోడించే అవకాశం ఉందని సమాచారం. ఏఎన్ఆర్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఆయన నటన, సిల్వర్ స్క్రీన్‌పై సృష్టించిన మాయాజాలాన్ని అభిమానులు మరోసారి ఆస్వాదించనున్నారు. అభిమానులు తమ తమ నగరాల్లోని థియేటర్లకు వెళ్లి, కుటుంబసభ్యులతో కలిసి ఈ క్లాసిక్ సినిమాలను చూసి ఆనందించాలని పిలుపునిచ్చారు.

# నవంబర్ 30 తర్వాత.. సుంకాలపై అమెరికా కోత..



రష్యా నుంచి ముడిచమురు కొంటున్న భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు అమెరికా 50శాతం సుంకాల భారం మోపిన సంగతి తెలిసిందే. నవంబర్ 30 తర్వాత డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం వాటిపై కోత పెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆ దిశగా నిర్ణయం ఉండొచ్చని కేంద్ర ప్రభుత్వంలో ప్రధాన ఆర్థిక సలహాదారు వెంకట్రామన్ అనంత నాగేశ్వరన్ ఆశాభావం వ్యక్తంచేశారు. అమెరికాతో వాణిజ్య చర్చలు పునఃప్రారంభం అయిన నేపథ్యంలో ఆయన ఈ అభిప్రాయం వ్యక్తంచేశారు. కోల్‌కతాలో మర్చంట్స్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహించిన కార్యక్రమంలో నాగేశ్వరన్ మాట్లాడారు. "ఈ కార్యక్రమంలో టారిఫ్‌లపై మాట్లాడేందుకు నేను కొంత సమయం తీసుకుంటాను. తొలుత విధించిన 25 శాతం ప్రతీకార సుంకాలతో పాటు మరో 25 శాతం అదనపు సుంకాలను మనం ఊహించలేదు. రెండోసారి విధించిన 25 శాతం సుంకాలకు భౌగోళికరాజకీయ పరిస్థితులు కారణమై ఉండొచ్చని నేను భావిస్తున్నాను. అయితే ఇటీవల పరిణామాలను గమనిస్తే.. నవంబర్ 30 తర్వాత అదనపు సుంకాల భారం ఉండకపోవచ్చని అనిపిస్తోంది. నేను ఈ మాట చెప్పడానికి ఎలాంటి కారణం లేదు. కానీ నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. అదనపు సుంకాలతో పాటు ప్రతీకార సుంకాలపై రానున్న రెండు నెలల్లో స్పష్టత రావొచ్చు" అని అంచనా వేశారు. అలాగే రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కోసం జరుగుతోన్న చర్చల గురించి ప్రస్తావించారు. ప్రస్తుతం భారత ఎగుమతుల విలువ 850 బిలియన్ డాలర్లుగా ఉండగా.. రానున్న రోజుల్లో 1 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని చెప్పారు. జీడీపీలో ఎగుమతుల వాటా 25 శాతంగా ఉంది. ఇది ఆరోగ్యకరమైన ఆర్థిక వ్యవస్థను సూచిస్తోందని వెల్లడించారు. చౌకగా లభిస్తోన్న రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకే సుంకాలు విధించామని ట్రంప్ ప్రభుత్వం చెప్తున్నప్పటికీ.. తమ వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ తలుపులు బార్లా తెరవకపోవడమే ప్రధాన కారణం. అప్పటికీ.. అగ్రరాజ్య ఒత్తిడి కారణంగా భారత ప్రభుత్వం పత్తిపై కొంత సడలింపు వైఖరి చేపట్టింది. విదేశీ పత్తి దిగుమతులపై 11శాతం సుంకాన్ని తొలగించింది. ఇక్కడ విదేశీ పత్తి అంటే అమెరికన్ పత్తి దిగుమతులే. ఇక, అమెరికా సుంకాల విషయంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. రైతులు, పశు పోషకులు, చిన్నతరహా పరిశ్రమల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఈ విషయంలో తమపై ఒత్తిడి పెరగొచ్చని.. కానీ దానిని భరిస్తామని స్పష్టంచేసిన సంగతి తెలిసిందే.






## క్రాష్ టెస్ట్‌లో 5 స్టార్ రేటింగ్‌తో టాటా ఆల్ట్రోజ్


టాటా మోటార్స్ తన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్ భారత్ ఎన్‌సీఏపీ క్రాష్ టెస్టులో 5 స్టార్ రేటింగ్ సాధించింది. ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్ వెర్షన్‌ను రూ.6.89 లక్షల (ఎక్స్-షోరూమ్) ప్రారంభ ధరతో ఇటీవల మార్కెట్‌లోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. రీఫ్రెష్డ్ లుక్‌తో పాటు మరికొన్ని కొత్త ఫీచర్లతో దీన్ని లాంచ్ చేశారు. ఈ క్రమంలోనే భారత్ ఎన్‌క్యాప్ నిర్వహించిన టెస్టులో ఆల్ట్రోజ్ 5-స్టార్ రేటింగ్ సాధించింది. ఈ మేరకు భారత్ ఎన్‌క్యాప్ తన అధికారిక వెబ్‌సైట్‌లో వెల్లడించింది. అడల్ట్ ఆక్యుపెంట్ ప్రొటెక్షన్‌లో ఆల్ట్రోజ్ 32 పాయింటక్లకు గానూ 29.65 పాయింట్లు సాధించిందని భారత్ ఎన్‌క్యాప్ తెలిపింది. ఫ్రంటల్ ఆఫ్‌సెట్ డిఫార్మబుల్ బ్యారియర్ టెస్టులో 16 పాయింట్లకు గానూ 15.55 పాయింట్లు సాధించిందని పేర్కొంది. దీని ద్వారా డ్రైవర్, ప్యాసింజర్ ఛాతీ, తొడల వద్ద సరైన రక్షణ లభిస్తుంది. సైడ్ మూవబుల్ డిఫార్మబుల్ బ్యారియర్ టెస్టులో 16 పాయింట్లకు గానూ 14.11 పాయింట్లు సాధించింది. చైల్డ్ ఆక్యుపెంట్ ప్రొటెక్షన్ విభాగంలో ఆల్ట్రోజ్ 49 పాయింట్లకు 44.90 పాయింట్లు సాధించింది. ఈ క్రాష్ టెస్ట్ ఫలితాలు అందుబాటులో ఉన్న స్మార్ట్, ప్యూర్, ప్యూర్ ఎస్, క్రియేటివ్, క్రియేటివ్ ఎస్, ఎకాంప్లిష్డ్, ఎకాంప్లిష్డ్ం ఎస్ వంటి అన్ని వేరియంట్లకు వర్తిస్తాయని భారత్ ఎన్‌క్యాప్ పేర్కొంది.



## పీసీబీలో అవినీతి రాజ్యమేలుతోంది

### పాకిస్థాన్ మాజీ క్రికెటర్

పీసీబీలో అవినీతి రాజ్యమేలుతోందని పాకిస్థాన్ మాజీ క్రికెటర్ అతిక్ ఉజ్ జమాన్ సోషల్ మీడియా వేదికగా ఆరోపించాడు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తమ జట్టు క్రికెటర్లకు నాసిరకం కిట్లను కట్టబెట్టిందని అతడు తీవ్రంగా విమర్శించాడు. దీనికి యూఏఈతో పాకిస్థాన్‌కు జరిగిన మ్యాచే సాక్ష్యమని అతడన్నాడు. ఇతర జట్లు సరైన డ్రై ఫిట్ కిట్స్‌తో ఆసియాకప్‌లో బరిలోకి దిగుతుంటే.. పాకిస్థాన్ ఆటగాళ్ల జెర్సీలు మాత్రం చెమటతో తడిసి ముద్దవుతున్నాయన్నాడు. పీసీబీ పెద్దలు కిట్ల తయారీని ప్రొఫెనల్స్‌కు కాకుండా వారి స్నేహితులకు అప్పజెప్పారని సోషల్ మీడియా వేదికగా ఆరోపించాడు. 'పాకిస్థాన్ ఆటగాళ్లు నాణ్యతలేని కిట్ల వల్ల చెమటతో తడిచి ముద్దయ్యారు. ఇతర జట్ల ఆటగాళ్లు మాత్రం సరైన డ్రై ఫిట్స్ ధరించారు. టెండర్లు ప్రొఫెషనల్స్‌కు కాకుండా ఫ్రెండ్స్‌కు అప్పగిస్తే ఫలితం ఇలాగే ఉంటుంది. చెమట కంటే.. అవినీతే ఎక్కువగా కారుతోంది' అని జమాన్.. ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. బుధవారం యూఏఈతో జరిగిన కీలక మ్యాచ్‌లో 41 పరుగులతో తేడాతో పాకిస్థాన్ గట్టెక్కింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ ఒకానొక దశలో కేవలం 9 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. తర్వాత కాస్త కోలుకున్నట్లు కనిపించినా.. మళ్లీ వెంటవెంటనే వికెట్లు కోల్పోయింది. చివరికి 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 146 పరుగులు చేయగలిగింది. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన యూఏఈ ఒకానొక దశలో 85/3తో విజయం వైపు సాగింది. అయితే కీలక సమయంలో వరుసగా వికెట్లు కోల్పోయి పరాజయం పాలైంది. ఈ క్రమంలో యూఏఈ 17.4 ఓవర్లలో 105 పరుగులకు ఆలౌటైంది. ఈ విజయంతో పాకిస్థాన్ సూపర్-4కు అవకాశం సాధించింది. దీంతో ఆ జట్టు టీమ్‌ఇండియాతో సెప్టెంబర్ 21న తలపడనుంది. గ్రూప్ స్టేజీలో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 7 వికెట్ల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే.



## నిరాశపర్చిన నీరజ్ చోప్రా..

### సచిన్ యాదవ్‌కు చేజారిన పతకం

**టోక్యో:** భారత జావెలిన్ సూపర్‌స్టార్ నీరజ్ చోప్రా ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను నిలబెట్టుకోలేకపోయాడు. గురువారం జరిగిన ఈ టోర్నీ ఫైనల్‌లో 12మంది పోటీపడగా నీరజ్ ఒక్కసారి కూడా 85 మీటర్ల మార్కు అందుకోలేకపోయాడు. ఉత్తమంగా 84.03 మీటర్లు విసిరి ఎనిమిదో స్థానానికి పరిమితమయ్యాడు. మూడు, ఐదో ప్రయత్నంలో ఫౌల్ చేసిన నీరజ్.. రెండో ప్రయత్నంలో 84.03 మీటర్లు విసిరాడు. అయితే, ఈ ఫైనల్‌లో పోటీపడిన మరో భారత అథ్లెట్ సచిన్ యాదవ్ అంచనాలకు మించి రాణించి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. అతను ఉత్తమంగా 86.27 మీటర్ల త్రో విసిరి మొత్తంమీద నాలుగో స్థానంలో నిలిచాడు. సచిన్ 40 సెంటీ మీటర్ల తేడాతో కాంస్య పతకం చేజార్చుకున్నాడు. 86.67 మీటర్లతో మూడో స్థానంలో నిలిచిన అమెరికా అథ్లెట్ థాంప్సన్ కాంస్య పతకం అందుకున్నాడు. కెషోర్న్ వాల్కాట్ (ట్రినిడాడ్ అండ్ టుబాగో, 88.16 మీ) స్వర్ణం గెలవగా.. అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా, 87.38 మీ) రజతం సాధించాడు.

## పసికూనపైనైనా
# 'వర్క్‌లోడ్' సూత్రం పాటిస్తారా..?



ఆసియా కప్‌లో భారత్ తన చివరి లీగ్ మ్యాచ్‌ను ఒమన్‌తో ఆడేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే పాకిస్థాన్, యూఏఈని చిత్తు చేసిన టీమ్‌ఇండియా మరో విజయంపై కన్నేసింది. ఇందులోనూ గెలిస్తే అగ్రస్థానంతో సూపర్ -4లో అడుగు పెడుతుంది. అయితే, తుది జట్టులో భారీ మార్పులు చోటు చేసుకొనే అవకాశం లేకపోలేదు. కానీ, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడనేది ఇప్పుడందరిలోనూ ఆసక్తికరంగా మారింది.

### బుమ్రాకు విశ్రాంతి ఇస్తారా?

గత ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో జస్‌ప్రీత్ బుమ్రాకు 'వర్క్‌లోడ్' రెస్ట్ ఇచ్చారు. ఐదింట్లో మూడు మ్యాచుల్లోనే ఆడించారు. అప్పుడు తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. ప్రధాన బౌలర్‌తో అన్ని మ్యాచులు ఆడించాలని కామెంట్లు వచ్చాయి. ఇప్పుడు ఆసియా కప్ లో ఒమన్ ఎలానూ పసికూనే. ఈ మ్యాచ్ తర్వాత టీమ్‌ఇండియా సూపర్ -4లో మ్యాచులు ఆడాలి. అక్కడంతా కాస్త కఠినమైన ప్రత్యర్థులే ఉంటారు. కాబట్టి, సీనియర్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇచ్చి.. యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌కు అవకాశం ఇస్తారనేది క్రికెట్ వర్గాల అంచనా. ఇక ఆల్‌రౌండర్ హార్దిక్‌కు రెస్ట్ ఇచ్చేసి బెంచ్‌పై ఉన్న హర్షిత్ రాణాను ఆడించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. వీరితోపాటు ప్రస్తుతం స్క్వాడ్‌లో మ్యాచ్ ఆడని మరో ఇద్దరు ప్లేయర్లు జితేశ్ శర్మ, రింకు సింగ్. మరి వీరిలో ఎవరికైనా అవకాశం వస్తుందో లేదో చూడాలి.

### ఎలా ఆడతారో..?

దుబాయ్‌లో పాకిస్థాన్‌తో మ్యాచ్ అనంతరం జరిగిన పరిణామాలు భారత క్రికెటర్లపై కాస్తైనా ప్రభావం చూపే ఉంటాయి. బుధవారం కూడా మరోసారి పాక్ క్రికెటర్లు ఎదురైనా సరే.. వారితో కనీసం మాట్లాడలేదు. వీటన్నింటినీ పక్కన పెట్టేసి ఒమన్‌తో మ్యాచ్ కోసం మైదానంలోకి దిగాల్సి ఉంది. అటువైపుగా జట్టును నడిపించాల్సిన బాధ్యత కెప్టెన్‌తోపాటు ప్రధాన కోచ్‌పై ఉంది. లీగ్ స్టేజ్‌లో చివరి మ్యాచ్ అనంతరం రెండు రోజులకే సూపర్ -4లో తొలి మ్యాచ్‌ను పాకిస్థాన్‌తో భారత్ (సెప్టెంబర్ 21న) ఆడనుంది. ఇక రెండో గ్రూప్ నుంచి శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌లో ఏ రెండు వస్తాయో ఇవాళ తేలనుంది. ఇప్పుడు ఒమన్‌తో మ్యాచ్‌ను రెండో దశకు సన్నాహకంగా మార్చుకోనుంది.

### బ్యాటింగ్‌లో మార్పులు ఏమైనా?

తొలి రెండు మ్యాచుల్లో ఓపెనర్లుగా శుభ్‌మన్ గిల్ - అభిషేక్ శర్మ వచ్చారు. సూర్యకుమార్ యాదవ్ వన్‌డౌన్‌లో ఆడాడు. సంజు శాంసన్ మూడో డౌన్‌లో కూడా బ్యాటింగ్‌కు రాలేదు. శివమ్ దూబెను మేనేజ్‌మెంట్ పంపింది. ఒమన్‌పై ఏమైనా బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేస్తుందేమో చూడాలి. సంజుకు ప్రమోషన్ ఇచ్చి ఓపెనర్‌గా ఆడించాలని అభిమానుల కోరిక. మున్ముందు కీలక మ్యాచులు ఉన్న నేపథ్యంలో బ్యాటింగ్ ప్రాక్టీస్ అవసరమనేది వారి భావన.

## పాక్ జట్టు వివాదాల మీద కాకుండా
# ఆటపై దృష్టి పెట్టాలి : కపిల్ దేవ్



ఆసియా కప్‌లో భాగంగా సెప్టెంబ్ 14న టీమ్‌ఇండియా, పాకిస్థాన్ తలపడ్డాయి. మ్యాచ్ అనంతరం టీమ్‌ఇండియా ఆటగాళ్లు, పాకిస్థాన్ క్రికెటర్లకు కరచాలనం ఇవ్వలేదు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో తాము ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని టీమ్‌ఇండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. అయితే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు దీనిపై అనవసర రాద్ధాంతం చేసింది. ఈ ఘటనకు బాధ్యుణ్ని చేస్తూ మ్యాచ్ రెఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను తొలగించాలని పీసీబీ డిమాండ్ చేసింది. లేదంటే టోర్నీనే బహిష్కరిస్తామని బెదిరింపులకు దిగింది. బుధవారం యూఏఈతో జరగాల్సిన మ్యాచ్‌కు కూడా పాక్ సరైన సమయానికి మైదానానికి చేరుకోలేదు. దీంతో గంట ఆలస్యంగా మ్యాచ్ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. పాకిస్థాన్ జట్టు వివాదాల మీద కాకుండా, తమ ఆటతీరును మెరుగుపరుచుకోవడంపై దృష్టి పెట్టాలని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ కపిల్ దేవ్ వారికి హితవు పలికారు. 'ఇవన్నీ చాలా చిన్న విషయాలు. పాకిస్థాన్ జట్టు తమ ఆటమీద దృష్టి పెట్టాలి. కరచాలనం ఇవ్వాలా.. వద్దా అనేది పర్సనల్ ఛాయిస్. కరచాలనం చేయాలా.. ఆలింగనం చేసుకోవాలా.. అనేది అవతల వారి ఇష్టం. ఒక వేళ కరచాలనం చేయకుంటే.. దాన్ని భూతద్దంలో చూస్తూ.. పెద్ద రాద్ధాంతం చేయాల్సిన అవసరం ఏ మాత్రం లేదు. దీని మీద వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సరికాదు. పాకిస్థాన్ సరైన క్రికెట్ ఆడటం లేదు. ముందు వారు తమ ఆటను మెరుగుపరుచుకోవడంపై దృష్టి సారించాలి' అని కపిల్ దేవ్ తన అభిప్రాయం వ్యక్తం చేశాడు. యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ 41 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో ఆ జట్టు సూపర్ 4కు చేరుకుంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ మరోసారి సెప్టెంబర్ 21న టీమ్‌ఇండియాతో తలపడనుంది.



## ఈపీఎఫ్‌ఓ సేవలన్నింటికీ
# ఇక సింగిల్ లాగిన్

ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. మెంబర్ పోర్టల్‌లోనే పీఎఫ్ లావాదేవీలను తెలుసుకునేలా పాస్‌బుక్ లైట్ పేరుతో కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. పాస్‌బుక్ కోసం ప్రత్యేకంగా లాగిన్ అయ్యే అవసరాన్ని తగ్గించింది. ఇకపై సింగిల్ లాగిన్‌తోనే ఈపీఎఫ్‌ఓకు సంబంధించిన అన్ని సేవలూ, పీఎఫ్ ఖాతా వివరాలు తెలుసుకోవచ్చని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ఈపీఎఫ్ సేవలకు సంబంధించిన సేవల కోసం ఈపీఎఫ్ మెంబర్ పోర్టల్‌ను తెరవాల్సి ఉంటుంది. ఈపీఎఫ్ ఖాతా బ్యాలెన్స్, లావాదేవీలు, విత్‌డ్రాలు వంటివి తెలుసుకోవాలంటే ప్రత్యేకంగా పాస్‌బుక్ పోర్టల్ ఓపెన్ చేయాల్సిందే. ఇకపై ఆ అవసరం లేకుండా ఈపీఎఫ్ మెంబర్ పోర్టల్‌లోనే పాస్‌బుక్ లైట్ పేరిట కొత్త సేవలకు శ్రీకారం చుట్టినట్లు మంత్రి వివరించారు. ఇందులో పీఎఫ్ కాంట్రిబ్యూషన్, విత్‌డ్రా, బ్యాలెన్స్ వంటి వివరాలు తెలుసుకోవచ్చు. సమగ్ర వివరాలు, గ్రాఫిక్స్‌తో కూడిన సమాచారం కావాలంటే పాస్‌బుక్ పోర్టల్‌ను వినియోగించుకోవచ్చని తెలిపారు. దీనివల్ల యూజర్ ఎక్స్‌పీరియన్స్ మెరుగవ్వడంతో పాటు సింగిల్ లాగిన్‌తోనే ముఖ్యమైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

### మెంబర్ పోర్టల్‌లో ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్

పీఎఫ్ సేవల్లో మరింత పారదర్శకత తీసుకురావడంలో భాగంగా (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్) ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం ఉద్యోగులు ఎవరైనా ఉద్యోగం మారినప్పుడు వారి పీఎఫ్ ఖాతాలు వేరే పీఎఫ్ కార్యాలయానికి బదిలీ అవుతాయి. ఈ క్రమంలోనే పాత పీఎఫ్ కార్యాలయం నుంచి కొత్త కార్యాలయానికి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ వెళుతుంది. ఇప్పటి వరకు ఈ సర్టిఫికెట్ కేవలం పీఎఫ్ కార్యాలయాల్లో మాత్రమే అందుబాటులో ఉంటోంది. సభ్యులు అడిగినప్పుడు మాత్రమే అందజేస్తున్నారు. ఇకపై మెంబర్ పోర్టల్‌లో పీడీఎఫ్ ఫార్మాట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. దీనివల్ల పీఎఫ్ బదిలీ సమాచారం తెలుసుకోవడంతో పాటు పీఎఫ్ బ్యాలెన్స్, సర్వీసు వివరాలు సరిగా అప్‌డేట్ అయ్యాయో లేదో సభ్యులు చెక్ చేసుకోవచ్చు. ఎంప్లాయీ పెన్షన్ స్కీమ్ ప్రయోజనాలు అందుకునే సందర్భంలో డిజిటల్ రికార్డుగానూ ఇది ఉపయోగపడుతుంది.

### సెటిల్‌మెంట్‌లు మరింత వేగంగా

ప్రస్తుతం పీఎఫ్ ట్రాన్స్‌ఫర్లు, సెటిల్‌మెంట్లు, అడ్వాన్సులు, రిఫండ్ వంటి సేవలకు ఆర్పీఎఫ్‌సీ/ ఆఫీసర్-ఇన్-ఛార్జి స్థాయి అధికారుల ఆమోదం తప్పనిసరి. ఈ విషయంలో కీలక మార్పు చేసింది. ఆ బాధ్యతలను అసిస్టెంట్ పీఫ్ కమిషనర్, సబార్డినేట్ స్థాయి ఉద్యోగులకు బదిలీ చేసింది. దీని వల్ల వేగంగా సెటిల్‌మెంట్లు పూర్తవుతాయని, ప్రాసెసింగ్ సమయం గణనీయంగా తగ్గుతుందని మంత్రి వివరించారు.



## మూడో రోజూ లాభాల్లోనే..

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడోరోజూ లాభాల్లో ముగిశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించడంతో సూచీలు రాణించాయి. దీనికితోడు ఇటీవల చేపట్టిన జీఎస్టీ సంస్కరణలు, అమెరికా- భారత్ మధ్య వాణిజ్య చర్చలు మదుపర్ల సెంటిమెంట్‌కు కారణమయ్యాయి. ముఖ్యంగా ఫార్మా, హెల్త్‌కేర్ స్టాక్స్‌తో పాటు బ్యాంకింగ్, ఐటీ, ఆటో, ఎఫ్‌ఎంసీజీ షేర్లు రాణించడం సూచీలకు కలిసొచ్చింది. ఈ క్రమంలోనే నిఫ్టీ 25,400 స్థాయిని దాటింది. ఈ ఉదయం 83,108.92 వద్ద (క్రితం ముగింపు 82,693.71) సెన్సెక్స్ లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 82,704.92- 83,141.21 మధ్య కదలాడిన సూచీ.. చివరకు 320.25 పాయింట్లు లాభంతో 83,013.96 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 74.90 పాయింట్లు పెరిగి 25,405.15 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 28 పైసలు తగ్గి 88.13 వద్ద ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టాటా మోటార్స్, ట్రెంట్, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 67.46 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3665.49 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# రెంట్ పేమెంట్స్ బంద్..

క్రెడిట్ కార్డుతో రెంట్ పేమెంట్ చెల్లింపులు చేసేవారికి చేదువార్త. ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థలైన ఫోన్‌పే, పేటీఎం, క్రెడ్ ఈ సేవలను నిలిపివేశాయి. ఆర్‌బీఐ తాజా ఆదేశాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకొన్నాయి. ఇటీవల కాలంలో చాలా మంది ఈ రెంట్ పేమెంట్ ఆప్షన్‌ను వినియోగిస్తున్నారు. నగదు కొరత ఉన్న సందర్భాల్లో దీనిని ఉపయోగించుకొని క్రెడిట్ కార్డు ద్వారా మరో అకౌంట్‌కు సొమ్ము బదిలీ చేసి.. అక్కడి నుంచి నగదు పొంది తమ అవసరాలు తీర్చుకుంటున్నారనేది అసలు నిజం. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ విడుదల చేసిన నోటిఫికేషన్ కారణంగా ఈ సేవలకు బ్రేక్ పడింది.

### ఆర్‌బీఐ ఏం చెప్పింది?

పేమెంట్ అగ్రిగేటర్లు, గేట్‌వేలకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలను కఠినతరం చేసింది. ఆయా సంస్థలతో నేరుగా సంబంధం లేని సంస్థలకు లావాదేవీలు ప్రాసెస్ చేయకూడదని సెప్టెంబర్ 15న ఆదేశాలు జారీ చేసింది. కేవైసీ వెరిఫికేషన్ పూర్తయిన మర్చంట్లకు మాత్రమే చెల్లింపులు చేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. రెంట్ పేమెంట్ విషయంలో యజమానులు ఎవరూ రిజిస్టర్డ్ వ్యాపారులు కాదు. దీంతో ఫిన్‌టెక్ సంస్థలు ఈ పేమెంట్స్‌ను నిలిపివేయాల్సి వచ్చింది. దీంతో ఇన్నాళ్లు క్రెడిట్ కార్డులపై ఆధారపడి రెంట్ పేమెంట్ చేసే వారికి ఇది ఇబ్బందికరంగా మారనుంది.

### బ్యాంకులు ముందు నుంచే

## ఆర్‌బీఐ ఆదేశాలతో ఫిన్‌టెక్ యాప్స్ నిర్ణయం

ఫిన్‌టెక్ సంస్థలు అందించే అద్దె చెల్లింపు ఆప్షన్ వినియోగించుకుని చాలా మంది క్రెడిట్ కార్డు ద్వారా తమ నగదు అవసరాలు తీర్చుకుంటున్న విషయాన్ని బ్యాంకులు ముందుగానే గుర్తించాయి. దీంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ వంటి బ్యాంకులు ఈ తరహా చెల్లింపులపై 1 శాతం ఫీజును వసూలు చేయడం ప్రారంభించాయి. వీటిపై రివార్డు పాయింట్ల జారీని కూడా నిలిపివేశాయి. క్రెడిట్ కార్డు ద్వారా జరుగుతున్న ఈ దుర్వినియోగాన్ని పసిగట్టిన కొన్ని ఫిన్‌టెక్ సంస్థలు కూడా కొన్నాళ్లపాటు రెంట్ పేమెంట్ ఆప్షన్‌ను నిలిపివేశాయి. కఠిన కేవైసీ నిబంధనలతో తిరిగి ప్రారంభించాయి. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో ఇన్నాళ్లు ఈ ఆప్షన్‌పై ఆధారపడిన వారు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com